Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 179 మేడ్చల్ మల్కాజ్‌గిరి 21 జూలై 2024 ఆదివారం పేజీలు : 4

### నిండుకుండలా తుంగభద్ర జలాశయం..

బెంగళూరు : తుంగభద్ర జలాశయంలోకి రోజురోజుకు ఇన్‌ఫ్లో ఎక్కువై నిండుకుండలా మారుతోంది. జలాశయంలో అత్యధిక ఇన్‌ఫ్లో వుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి 1,08,326 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు అధికారులు తెలిపారు. 59.056 టీఎంసీలు నీరు జలాశయంలో చేరాయి. జలాశయం పైభాగంలోని తుంగ, భద్ర జలాశయాలు నిండి, తీర్థహళ్లి, కొడుగు, మలనాడు ప్రాంతాల్లో అత్యధిక వర్షపాతం వుండటంతో అనుకున్న స్థాయికన్నా ఎక్కువగా నీరు చేరుతోంది. ఇప్పటికే రైతన్నలు నాట్లు వేసేందుకు సంసిద్ధులయ్యారు. తుంగభద్ర కాలువ నుంచి సాగునీరు కూడా విడుదల చేశారు. హెచ్చెల్సీ, ఎల్‌ఎల్‌సీ కాలువలకు కూడా జలాశయం నుంచి సాగునీరు విడుదల చేశారు.

# నిరుద్యోగులకు ఎటువంటి అన్యాయం జరగనివ్వం





## వారి బాధలు మాకు తెలుసు: రేవంత్‌రెడ్డి

### 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకాన్ని ప్రారంభించిన సీఎం

హైదరాబాద్: 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాభవన్‌లో ప్రారంభించారు. ఇందులో భాగంగా సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన రాష్ట్ర అభ్యర్థులకు సింగరేణి సంస్థ ద్వారా ఆర్థిక సాయం అందించనున్నారు. అంతకుముందు సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన రాష్ట్ర అభ్యర్థులతో సీఎం ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రులు భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, సింగరేణి సీఎండీ బలరామ్ పాల్గొన్నారు. ఉద్యోగ నియామకాల కోసమే రాష్ట్రాన్ని సాధించుకున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. "విద్యార్థుల త్యాగాలతో రాష్ట్రం ఏర్పడింది. 90 రోజుల్లో 30 వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశాం. ఏళ్ల తరబడి ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్నారు. నిరుద్యోగుల బాధలు మాకు తెలుసు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్స్ ఇచ్చాం. టీజీపీఎస్సీని పునర్‌వ్యవస్థీకరించాం.

పరీక్షలు మాటిమాటికి వాయిదా పడటం మంచిదికాదు. అభ్యర్థుల సమస్యలను అర్థం చేసుకుని గ్రూప్-2ను వాయిదా వేశాం.

**నిరుద్యోగుల సమస్యల పరిష్కారమే తొలి ప్రాధాన్యం :** నిరుద్యోగుల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యం. ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేస్తాం. ప్రణాళిక ప్రకారం ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేస్తున్నాం. జూన్ 2న నోటిఫికేషన్, డిసెంబర్ 9 లోపు ఉద్యోగాలిచ్చేలా జాబ్ క్యాలెండర్ రూపొందిస్తాం. సివిల్స్ అభ్యర్థులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం తరపున సాయం చేస్తున్నాం. మెయిన్స్‌కు ఎంపికైన అభ్యర్థులు కచ్చితంగా జాబ్ సాధించాలి. సివిల్స్ సాధించి మన రాష్ట్రానికే రావాలి. ఐఏఎస్, ఐపీఎస్‌లు మన వారైతే రాష్ట్రానికి మంచి జరుగుతుంది.

నోటిఫికేషన్ ఇచ్చి సమయానికి పరీక్షలు నిర్వహించిన దాఖలాలు గత పదేళ్లలో లేవు. అందుకు కారణమేదైనా యువత ఉజ్వల భవిష్యత్ ఆగమైంది. దురదృష్టవశాత్తూ కొన్నేళ్లుగా తెలంగాణలో యువత ఉద్యోగాలకు సన్నద్ధమయ్యేదానికంటే.. పరీక్షల్లో జరిగే నిర్వహణ లోపాలపై కొట్లాడేందుకే వారి సమయం వృథా అయ్యింది. యూపీఎస్సీ ఎప్పుడు పరీక్షలు నిర్వహించినా.. వాటిపై ఆరోపణలు లేవు. అందుకే మేం గతంలో యూపీఎస్సీ ఛైర్మన్‌ను కలిశాం. యూపీఎస్సీ తరహాలో కొన్ని మార్పులు చేసి వెంట వెంటనే నోటిఫికేషన్లు ఇస్తున్నాం" అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

# బడ్జెట్‌పై వేతన జీవుల ఆశలు..



## హెచ్‌ఆర్‌ఏ పరిమితి పెంపునకు డిమాండ్!

ఆదాయపు పన్ను చట్టం 1961లోని సెక్షన్ 10 ప్రకారం వేతన జీవులు మునుపటి సంవత్సరంలో చెల్లించిన ఇంటి అద్దెపై పన్ను మినహాయింపును కోరే అవకాశం ఉంది. వేతనంలో హెచ్‌ఆర్‌ఏ భాగమై ఉంటేనే దీనికి అర్హులు. ఆదాయపు పన్ను నిబంధనలు 1962లోని రూల్ 2 ప్రకారం హెచ్‌ఆర్‌ఏ మినహాయింపు మొత్తాన్ని నిర్ణయిస్తారు. ప్రస్తుత హెచ్‌ఆర్‌ఏ మినహాయింపు పరిమితిని చాలాకాలం క్రితం నిర్ణయించారు. మెట్రో, మెట్రోయేతర నగరాల్లో అద్దె చెల్లింపులు విపరీతంగా పెరగడం వల్ల ఈ మినహాయింపును ఈసారి కేంద్ర బడ్జెట్‌లో క్రమబద్ధీకరించాలని వేతన జీవులు కోరుతున్నారు. ప్రస్తుతం మెట్రో నగరాలైన చెన్నై, ముంబయి, కోల్‌కతా, దిల్లీలో మూల వేతనంలో 50 శాతంపై హెచ్‌ఆర్‌ఏ మినహాయింపు కోరవచ్చు. బెంగళూరు, అహ్మదాబాద్, పుణె వంటి ఇతర పెద్ద నగరాల్లో ఇది 40 శాతంగా కొనసాగుతోంది. అద్దె భారం భారీగా పెరిగిన నేపథ్యంలో 50 శాతం పరిమితిని అన్ని నగరాలకు వర్తింపజేయాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. మరోవైపు అద్దె చెల్లింపుల నుంచి మూలవేతనంలో 10 శాతాన్ని తీసివేయగా వచ్చిన మొత్తాన్ని మినహాయింపునకు పరిగణిస్తున్నారు. దీన్ని ఐదు శాతానికి తగ్గించాలని కోరుతున్నారు. తద్వారా మినహాయింపు వర్తించే మొత్తం పెరుగుతుంది. వీటితో పాటు కొత్త పన్ను విధానంలోనూ హెచ్‌ఆర్‌ఏ మినహాయింపును అనుమతించాలని కోరుతున్నారు.

**ఇతర డిమాండ్లు..** తాత్కాలిక స్టాండర్డ్ డిడక్షన్‌ను ప్రస్తుత రూ.50,000 నుంచి రూ.1,00,000కు పెంచాలి. ప్రాథమిక మినహాయింపు పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలు చేయాలి. కొత్త/డిఫాల్ట్ పన్ను విధానంలోనూ సెక్షన్ 80C, సెక్షన్ 80D, సెక్షన్ 80E, సెక్షన్ 80%జుజుదీ% వంటి వివిధ పన్ను మినహాయింపులను అనుమతించాలి. వైద్య ఖర్చులు పెరగడం వల్ల సెక్షన్ 80డి కింద కవర్ అయ్యే మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లింపుల మినహాయింపు పరిమితిని మరో రూ.25,000 పెంచాలి. సెక్షన్ 80TTA కింద పొదుపు ఖాతాల వడ్డీ ఆదాయంపై లభించే పన్ను రాయితీ పరిమితిని రూ.10,000 నుంచి రూ.50,000కు పెంచాలి. టర్మ్ డిపాజిట్లు/రికరింగ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీ ఆదాయానికి కూడా ఈ సెక్షన్‌ను వర్తింపజేయాలి. పాత పన్ను విధానంలో హోం లోన్‌పై చెల్లించే వడ్డీలో రూ.2 లక్షల వరకు మినహాయింపు ఉంటుంది. రియల్ ఎస్టేట్ ధరలు, గృహ రుణ వ్యయాల పెరుగుదల, ద్రవ్యోల్బణం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. మినహాయింపు పరిమితిని రూ.5 లక్షలకు పెంచాలి. అలాగే కొత్త పన్ను విధానంలోనూ పన్ను చెల్లింపుదారులకు ఈ మినహాయింపును ఇవ్వాలి. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఈనెల 22 నుంచి ఆగస్టు 12 వరకు జరగనున్నాయి.

23న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. 22న ఆర్థిక సర్వేను సభకు సమర్పిస్తారు. ఈ ఏడాది ఎన్నికల సంవత్సరం కావడంతో ఫిబ్రవరి 1న 2024-25కి సంబంధించిన ఓటాన్ అకౌంట్ ప్రవేశపెట్టారు. ఇప్పుడు పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. భారత్‌ను ప్రపంచదేశాలతో పోటీపడేలా ముందుకునడిపించడమే ఈసారి తన లక్ష్యమని ప్రధాని మోదీ ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో కొత్త బడ్జెట్‌పై అన్ని వర్గాల్లో ఆసక్తి నెలకొంది.




## 10 కిలోల బరువు తగ్గిన కవిత ?.. భర్త అనిల్ కంటతడి!

ఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోగ్యం క్షీణించినట్లు తెలుస్తోంది. ఈ కేసులో తిహార్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఆమె ఇటీవలే అనారోగ్యానికి గురయ్యారు. జైలు అధికారులు ఆమెను ఎయిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లి, వైద్యం చేయించిన అనంతరం తిరిగి జైలుకు తీసుకొచ్చారు. కాగా కవిత ఆరోగ్యం క్షీణించడం పట్ల భర్త అనిల్ కంటతడి పెట్టినట్లు తెలుస్తోంది. ఎయిమ్స్‌లో ఆమెను చూసి అనిల్ భావోద్వేగానికి గురయ్యారు.

ఈ క్రమంలో మెరుగైన వైద్య చికిత్సల నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రిలో వైద్య పరీక్షలకు అనుమతి ఇవ్వాలంటూ కవిత తరఫు న్యాయవాది మోహిత్‌రావు న్యాయస్థానాన్ని కోరారు. ఇందుకు నిరాకరించిన కోర్టు ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలకు అనుమతి ఇచ్చింది.

**10 కిలోల బరువు తగ్గిన కవిత!...** నాలుగు నెలలుగా జైల్లో ఉంటున్న కవిత ఏకంగా 10 కిలోల బరువు తగ్గినట్లు సమాచారం. తరచూ అనారోగ్యానికి గురవుతుండటంతో నీరసంగా ఉంటున్నట్లు తెలిసింది. ఎయిమ్స్ ఆసుపత్రిలోనే ఆమెకు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర పరీక్షలు చేశారు. అనారోగ్యం, బరువు తగ్గుతుండటం, ఆరోగ్యం క్షీణిస్తుండటంపట్ల ఆమె తండ్రి, బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది.

జైలులో దోమలు ఎక్కువగా ఉండటంతో అందులోని చాలా మంది ఖైదీలకు డెంగ్యూ సోకుతోందని.. దీంతో కవిత కూడా అనారోగ్యానికి గురవుతున్నట్లు ఆమె తరఫు న్యాయవాదులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఆమె ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీసేందుకు కేటీఆర్, హరీశ్ రావు జులై 22న ఢిల్లీకి వెళ్లనున్నారు. కవిత ఆరోగ్యంపట్ల బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు.

# నేడు ఢిల్లీకి సీఎం రేవంత్..

# మంత్రి విస్తరణ - పీసీసీ చీఫ్

## ఇదే ప్రధాన అజెండా..!




తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. ఆది, సోమవారాల్లో ఆయన హస్తినలో ఉండనున్నారు. ఆదివారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి రేంవత్ రెడ్డి ఢిల్లీ చేరుకుంటారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలతో పాటు.. పలువురు కేంద్రమంత్రులను రేవంత్ రెడ్డి కలవనున్నారు. ముఖ్యంగా మంత్రివర్గ విస్తరణతో పాటు కొత్త పీసీసీ అధ్యక్షుడి ఎంపికపై హైకమాండ్‌తో చర్చించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొన్ని నామినేటెడ్ పదవుల పంపకం పూర్తవ్వడంతో.. మిగిలిన పదవులు ఎవరెవరికి కేటాయించాలి.. పదవులు దక్కని సీనియర్లను ఎలా గౌరవించాలనే విషయంపై కూడా అధిష్టానంతో రేవంత్ చర్చించనున్నారు. మరోవైపు వరంగల్‌లో ఏర్పాటుచేయబోయే భారీ సభకు రాహుల్ గాంధీని ఆహ్వానించనున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రైతు రుణమాఫీ అమలు చేయడంతో రాహుల్‌తో సభ పెట్టిస్తే బాగుంటుందనే ఉద్దేశంలో రాష్ట్ర నాయకులు ఉన్నారు. ఈ విషయాన్ని హైకమాండ్‌కు రేవంత్ తెలియజేయనున్నారు.

**కేంద్రమంత్రులతో..** రెండు రోజుల పర్యటనలో పలువురు కేంద్రమంత్రులను రేవంత్ రెడ్డి కలవనున్నారు. విభజన హామీల అమలుతో పాటు.. కొత్త రుణాలు, ప్రాజెక్టుల మంజూరుపై వివిధ శాఖల మంత్రులతో సమావేశమవుతారు. రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిసే అవకాశం ఉంది. మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పలు ప్రాజెక్టులపై చర్చించనున్నారు. పెండింగ్ ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేయాలని కోరనున్నారు.

**ఖర్గే, రాహుల్‌తో..** సీఎం రేవంత్ రెడ్డి ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లికార్జున్ ఖర్గేతో పాటు రాహుల్ గాంధీని కలవనున్నారు. పార్టీకి సంబంధించిన అంశాలపై ఆయన చర్చించనున్నారు. ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు గడుస్తుండటంతో మంత్రివర్గ విస్తరణపై హైకమాండ్‌తో చర్చించి.. ఎవరిని కొత్తగా మంత్రి వర్గంలోకి తీసుకోవాలనేదానిపై రేవంత్ చర్చలు జరిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో తాజా రాజకీయ పరిస్థితులను వివరించడంతో పాటు.. చేరికల అంశం ఈ సమావేశంలో చర్చకు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా పీసీసీ చీఫ్ ఎంపికపై ప్రస్తుత ఢిల్లీ పర్యటనలో క్లారిటీ వచ్చే ఛాన్స్ ఉంది. గత ఢిల్లీ పర్యటనలోనే పీసీసీ చీఫ్ ఎంపికపై ఓ నిర్ణయానికి వచ్చినప్పటికీ.. పార్టీలో ఏకాభిప్రాయం రాకపోవడంతో పీసీసీ చీఫ్ ఎంపిక వాయిదాపడింది. ఈసారి మాత్రం కొత్త పీసీసీ చీఫ్ ఎంపికపై స్పష్టత రానున్నట్లు తెలుస్తోంది.

# సంపాదకీయం

## పాండ్యా.. మొన్న వైస్ కెప్టెన్.. నిన్న 'కెప్టెన్'.. నేడు ఏమీ లేదు

శ్రీలంకతో సిరీస్ కు ముందు భారత జట్టు విషయంలో పెద్ద చర్చనే జరిగింది. మూడు టి20లు ఆడాల్సిన సిరీస్ కు కెప్టెన్ ఎవరనేది సందిగ్ధం నెలకొంది. వన్డేలకు ఎలాగూ స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ తిరిగొస్తాడు కాబట్టి.. పొట్టి ఫార్మాట్ లో నడిపించేది ఎవరనే చర్చ జరిగింది. దీనికి అందరూ ఊహించిన సమాధానం ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా. ఐపీఎల్ లో, గతంలోనూ టి20ల్లో టీమ్ ఇండియాకు కెప్టెన్ గా పనిచేసిన పాండ్యానే తదుపరి కెప్టెన్ గానూ భావించారు. కానీ.. అనూహ్యంగా సూర్య కుమార్ యాదవ్ పేరు ప్రకటించారు. మరి దీనివెనుక ఏం జరిగింది...? మొన్నటివరకు వైస్ కెప్టెన్ అయిన ఆటగాడు.. ఇప్పుడు అదేమీ లేకుండా ఎలా మిగిలాడు?

**మొన్న వైస్ అయినప్పటికీ..** పాండ్యా భారత్ విజేతగా నిలిచిన మొన్నటి టి20 ప్రపంచ కప్ లో జట్టుకు వైస్ కెప్టెన్. 2022 టి20 ప్రపంచ కప్ అనంతరం రోహిత్ ను కాదని పాండ్యాకు కెప్టెన్సీ ఇచ్చారు. అయితే, రోహిత్ తిరిగి రావడంతో మళ్లీ పాండ్యాను వైస్ చేశారు. సరే.. రోహిత్ తప్పుకొనడంతో పాండ్యానే తదుపరి పూర్తి స్థాయి కెప్టెన్ అని భావించారు. కానీ, జరిగింది వేరు. కొత్త హెడ్ కోచ్ గంభీర్ వస్తూ వస్తూనే హార్దిక్ స్థానంలో సూర్య సారథ్యం వైపు మొగ్గుచూపాడు. పాండ్యాకు కనీసం వైస్ కెప్టెన్సీ కూడా ఇవ్వలేదు. దీంతో హార్దిక్ టి20 జట్టులో సాధారణ ఆటగాడిగా మిగిలాడు.

**ఆటగాళ్లు మొగ్గుచూపలేదా?...** రోహిత్ స్థానంలో పాండ్యా కంటే సూర్యనే బెటర్ అని జట్టులోని ఆటగాళ్లు భావించినట్లు సమాచారం. సూర్య అయితేనే స్వేచ్ఛ ఇస్తాడని వారు చెప్పినట్లు తెలిసింది. మరోవైపు సూర్యకు కూడా ఫిట్ నెస్ సమస్యలు ఉన్నాయి. అయితే, అవి హార్దిక్ అంత మాత్రం కాదు. దీంతోనే సెలక్టర్లు, గంభీర్ కూడా సూర్యను కెప్టెన్ చేశారు. కాగా, ఐపీఎల్ లో హార్దిక్ ఈ ఏడాది ముంబై ఇండియన్స్ కు సారథ్యం వహించాడు. గుజరాత్ టైటాన్స్ ను రెండేళ్లు చక్కగానే నడిపిన అతడు ఈసారి ముంబైకి వచ్చాడు. కానీ, జట్టు దారుణ ప్రదర్శన చేసింది. ఇదికూడా పాండ్యాకు కొంత దెబ్బనే.

# ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి తప్పక అందించాలి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతం




జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : ప్రభుత్వం అమలు చేస్తున్న గృహ జ్యోతి, మహాలక్ష్మి పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. శనివారం రోజున మేడ్చల్ జిల్లాలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాల కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. నమోదైన దరఖాస్తులను పరిశీలించారు. ప్రజా పాలన లో ఎన్ని దరఖాస్తులు వచ్చాయని సంబంధిత అధికారులు అడిగి తెలుసుకున్నారు. వృన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రజా పాలల్లో వచ్చిన దరఖాస్తులను ఆన్లైన్లో డేటా విభాగంలో ఎప్పుడు కప్పుడు ఎంట్రీ చేయాలన్నారు. ప్రజా పాలన లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు అందించిన గృహజ్యోతి,మహాలక్ష్మి (గ్యాస్) పథకం విజయవంతంగా కొనసాగించాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకునే ప్రక్రియలో పొరపాట్లను సరి చేసుకునేందుకు ఈ ప్రజాపాలన సేవా కేంద్రం ఉపయోగపడుతుందన్నారు. తదనంతరం మేడ్చల్ లోని జిల్లా పరిషత్ పాఠశాల (బాలికల )సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పేరెంట్స్,ఉపాధ్యాయుల సమావేశంలో కలెక్టర్ పాల్గొని విద్యార్థుల తల్లిదండ్రులతో ముచ్చటించారు. విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలలో మీ పిల్లలకు ఉపాధ్యాయులు చదువు ఎలా చెపుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు.

నోట్ బుక్స్ టెక్స్ట్ బుక్స్ మీ పిల్లలకు అందినవా అని అడిగారు. మధ్యాహ్నం భోజనం నాణ్యతతో పిల్లలకు అందిస్తున్నారా అని విద్యార్థుల తల్లిదండ్రులను అడిగారు, విద్యార్థుల తల్లిదండ్రులను ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. మీ పిల్లలను స్కూల్ నుండి ఇంటికి వచ్చిన తర్వాత బాధ్యత తీసుకొని పిల్లలను చదివించాలన్నారు. మీ పిల్లలు మంచిగా చదువుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందని పిల్లలకు తల్లిదండ్రులు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సి ఇ ఓ దిలీప్ కుమార్, మేడ్చల్ ఎమ్మార్వో శైలజ, జిల్లా విద్యాధికారి విజయ కుమారి,ఎంపీడీవో వసంత లక్ష్మి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రవాణా కేంద్రాలు.. దళారులు రాజ్యాలు

హైదరాబాద్ : గ్రేటర్‌లోని రవాణాశాఖ కార్యాలయాల వద్ద దళారుల ప్రమేయం మరోసారి తేటతెల్లమైంది. రాష్ట్ర వ్యాప్తంగా అవినీతి నిరోధక శాఖ మంగళవారం చేపట్టిన దాడుల్లో భాగంగా గ్రేటర్‌లోని బండ్లగూడ, మలక్‌పేట్, టోలిచౌకి, మణికొండ కార్యాలయాల్లో దళారుల దందా బయట పడింది. నాలుగు కార్యాలయాల్లో రూ.1.37 లక్షలు లెక్క చూపని నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇదంతా దరఖాస్తుదారుల నుంచి దళారులు వసూలు చేసినట్లు స్పష్టమవుతోంది. ఇలా అన్ని కార్యాలయాల్లో నెలలో రూ.కోట్లలోనే అనధికారిక లావాదేవీలు జరుగుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ ఆర్టీఏలు వాటి పరిధిలో ఉప రవాణాశాఖ కార్యాలయాలు ఉన్నాయి. దాదాపు అన్ని కార్యాలయాల వద్ద దళారుల దందా అనేది బహిరంగ రహస్యమే.

రెట్టింపు ఛార్జీల వసూలు: రిజిస్ట్రేషన్ చేయించడం, వాహన యాజమాన్య హక్కుల మార్పిడి, కొత్త లైసెన్సులు ఇప్పించడం తదితర సేవలకు దళారులు రెట్టింపు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఇందులో కొంత అక్కడ సిబ్బందికి వాటాలుగా పంపుతున్నారు. ఇలా సాయంత్రానికి ఎవరివి వారికి అందుతుంటాయి. వాస్తవానికి ఆర్టీఏలో 43 రకాల సేవలను ఆన్‌లైన్‌లో పొందే అవకాశం రవాణాశాఖ కల్పించింది. అయితే కొన్ని రకాల సేవలకు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నా కార్యాలయాలకు రావాల్సిందే.


ఏసీబీని చూసి... పర్సు వదిలేశారు..

మలక్‌పేటలోని ఈస్ట్ జోన్ ఆర్టీఏ కార్యాలయంలో సోదాల సందర్భంగా దరఖాస్తుదారులను విచారించి పంపించి వేయగా...15 మంది దళారులను గుర్తించారు. ఉద్యోగుల టేబుళ్లు, డెస్కులు, దస్త్రాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఒక గుర్తు తెలియని పర్సు ఏసీబీకి లభించింది. అందులో రూ.22 వేలు ఉన్నాయి. అనంతరం ఏసీబీ డీఎస్పీ కె.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీఏ కార్యాలయంలో పలు అవకతవకలు జరిగాయని గుర్తించామని వివరించారు. పలువురు ఏజెంట్లు, బ్రోకర్లు కార్యాలయంలో ఉన్నారని.. పూర్తిస్థాయిలో విచారించి నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

పరుగో పరుగు...

దాడుల సందర్భంగా పలువురి ఏజెంట్ల వద్ద డబ్బులు పట్టుబడ్డాయి. బండ్లగూడలో రూ.48,370, మలక్‌పేట్‌లో రూ.22 వేలు, టోలిచౌకిలో రూ.43,360, మణికొండలో రూ.23,710 ఏసీబీ స్వాధీనం చేసుకుంది. వినియోగదారుల నుంచి వసూలు చేసి సాయంత్రానికి ఆర్టీఏ అధికారులు, సిబ్బందికి వాటాలు ముట్టజెప్పేందుకు ఉంచిన నగదుగా భావిస్తున్నారు. ఏసీబీ అధికారులు తలుపులు మూసి లోపల ఉన్న వారందరినీ విచారించారు. కౌంటర్ల వద్ద, కార్యాలయంలో ఉన్న నలుగురు ఏజెంట్లను అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ దాడులు తెలుసుకున్న పలువురు ఏజెంట్లు తమ చేతుల్లో ఉన్న దరఖాస్తు ఫారాలను దూరంగా విసిరేసి బయటికి పరుగులు తీశారు. బండ్లగూడలో సిబ్బందిలో ఒకరు పారిపోతుండగా పట్టుకుని విచారించారు. కొందరు సిబ్బంది, అధికారుల వద్ద నగదు ఉన్నట్లు కనుగొన్నారు. కంప్యూటర్లలో నిక్షిప్తమైన వివరాలనూ పరిశీలించారు. ఆర్టీఏ కార్యాలయాల సమీపంలోని డ్రైవింగ్ స్కూళ్లు, జిరాక్సు సెంటర్లను మూసివేశారు.

# రాయితీ దక్కదు.. వడ్డీ వదలదు



వికారాబాద్ : ప్రకృతి అనుకూలించక అన్నదాతలు అవస్థలు పడుతుంటే పంట రుణాలపై బ్యాంకులు వడ్డీ వసూలు చేస్తూ అదనపు భారం మోపుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచే వానాకాలం పంట రుణాల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. ఉత్పత్తుల విక్రయాలతో వచ్చే సొమ్ముతో రైతులు రుణాలను పెద్ద ఎత్తున నవీకరణ (రెన్యువల్) చేస్తారు. అయితే రుణాలకు పావలా వడ్డీని వర్తింపజేసే రాయితీపై ప్రభుత్వ ఉత్తర్వులు రానందున బ్యాంకులు వడ్డీని వసూలు చేస్తుండటంతో రైతులపై ఏటా రూ.75 కోట్ల భారం పడుతోంది. దీనికి సంబంధించి కథనం.

తీసుకున్న తేదీ నుంచే వర్తింపు రైతులు బ్యాంకుల నుంచి పంట రుణాలను తీసుకున్న తేదీ మొదలు ఏడాది లోపు అసలు చెల్లిస్తే రూ.లక్ష వరకు సున్నా వడ్డీ, రూ.లక్ష నుంచి రూ.3 లక్షల వరకు ఉన్న రుణాలకు పావలా వడ్డీ వర్తింపజేస్తున్నారు.

వ్యవసాయ రుణాలకు 7 శాతం వడ్డీ ఉండగా, 3 శాతం కేంద్ర ప్రభుత్వం, 4 శాతం రాష్ట్ర ప్రభుత్వం బ్యాంకులకు చెల్లించాలి. కేంద్రం వడ్డీ రాయితీని సక్రమంగా చెల్లిస్తోంది.

నిధులు కేటాయిస్తేనేగదా..

గడిచిన ఆరేళ్లలో తొలి రెండు సంవత్సరాల్లో రాష్ట్ర ప్రభుత్వం వడ్డీ రాయితీ ఇస్తున్నట్లు ఉత్తర్వులను జారీ చేసినా బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు నిధులు కేటాయించలేదు. ఫలితంగా చాలా సంఘాలు, బ్యాంకర్లు తామే వడ్డీని భరించాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో బ్యాంకర్లు, సహకార సంఘాలు మూడేళ్లుగా రైతుల దగ్గర నుంచి తప్పనిసరిగా వడ్డీ వసూలు చేస్తున్నాయి.

మరోవైపు జిల్లాలోని 22 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.105 కోట్లకు పైగా రాయితీ రావాల్సి ఉంది. ఈ మొత్తం రానందున లాభాలను బదలాయించక రైతులు రెండు రకాలుగా నష్టపోతున్నారు.

జిల్లాలో 2.44 లక్షల మంది రైతులు వానాకాలం, యాసంగి సీజన్లలో రూ.2,175 కోట్ల వరకు పంట రుణాలు తీసుకుంటున్నారు. రైతుల నుంచి వడ్డీ తీసుకోకున్నా కూడా ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్‌గా బ్యాంకర్లకు ఇస్తే తిరిగి రైతులకు బ్యాంకర్లు చెల్లిస్తారు. అయితే ప్రభుత్వం ఇవ్వకపోవడంతో తామే నేరుగా వసూలు చేయాల్సి వస్తోందని బ్యాంకర్లు చెబుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాలు రావాల్సి ఉంది

– రాంబాబు, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్

ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే రైతులకు వడ్డీ రాయితీ వర్తింపజేస్తాం. వడ్డీ వసూలుపై ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాల్సి ఉంది. నిధులు విడుదలైతేనే రాయితీ వ్యవహారం కొలిక్కి వస్తుంది. లేదంటే రైతులే వడ్డీ చెల్లించక తప్పదు.

పావలా వడ్డీ కూడా వర్తించలేదు

– నర్సిములు, అల్లీపూర్, ధారూర్

నేను ఎస్‌బీఐ ధారూర్‌శాఖలో ఏడాది కిందట రూ.లక్ష పంట రుణం తీసుకున్నా. రూ.8 వేలు చెల్లించి రుణాన్ని నవీకరణ చేసుకున్నా. గతంలో మాదిరిగా ఎలాంటి రాయితీ ఇవ్వలేదు. పావలా వడ్డీ కూడా వర్తించలేదు. బ్యాంకు సిబ్బందిని అడిగితే వడ్డీ రాయితీ నిధులు వస్తే చెల్లిస్తామన్నారు.

ఆర్థిక ఆసరా కల్పించాలి రాములు, పుల్‌మద్ది, వికారాబాద్

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, శివారెడ్డిపేటలో రూ.80 వేలు పంట రుణం తీసుకున్నా. ఐదేళ్ల కిందట బ్యాంకులో పంట రుణాలను తీసుకున్న తేదీ నుంచి ఏడాది లోపు అసలు చెల్లిస్తే రూ.లక్ష వరకు వడ్డీ వేసేవారు కాదు. ప్రస్తుతం సున్నా వడ్డీ ఊసే ఎత్తడం లేదు. వడ్డీ వసూలు చేయకుండా ఆర్థిక ఆసరా కల్పించాలి.

# నాణ్యత పాటించని హొటళ్ల పై కఠిన చర్యలు తప్పవు

శామీర్ పేట, (గరుడ వార్త) : నాణ్యత పాటించని హొటళ్లపై కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ అధికారులు హెచ్చరించారు. తూముకుంట లోని శ్రీ కృష్ణ హొటల్లో శ్రీనివాస్ రెడ్డి అనే వినియోగదారుడు బిర్యాని తింటుండ గా బొద్దింక వచ్చిందని మునిసిపల్ అధికారులకు ఫోన్లో శనివారం ఫిర్యాదు చేశాడు. వెంటనే కమిషనర్ వెంకట గోపాల్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్స్పెక్టర్ రేణుక తన సిబ్బందితో శ్రీ కృష్ణ



హొటల్‌ను తనిఖీ చేశారు. హొటల్లో పరిశీలించగా అందులో పూర్తిగా నాణ్యత లోపించడం, అపరిశుభ్రంగా ఉండడంతో అధికారులు వెంటనే సీజ్ చేశారు. మును ముందు మున్సిపల్ పరిధిలోని అన్ని హొటల్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టనున్నట్లు అధికారులు హెచ్చరించారు. వార్డు ఆఫీసర్లు ప్రసన్న, మౌనిక, బిల్ కలెక్టర్ కిష్టయ్య, జవాన్లు నరేష్, ప్రవీణ్ రెడ్డి, జగన్నాథం, సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన మద్యం ను ధ్వంసం చేసిన శామీర్ పేట పోలీసులు

శామీర్ పేట,(గరుడ వార్త ): అక్రమంగా రవాణా చేస్తు, బెల్టు షాపుల్లో స్వాధీనం చేసుకున్న మద్యం ను శామీర్ పేట పోలీసులు శనివారం ధ్వంసం చేశారు. 2024 సంవత్సరంలో శామీర్ పేట్ పోలీస్ స్టేషన్ లో నమోదైన 63 ఎక్సైజ్ యాక్ట్ కేసులయిన బెల్టు షాపులు, అక్రమంగా




రవాణా చేస్తున్న 690 లీటర్ల మద్యం ను శామీర్ పేట ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో ఎక్సయిజ్ అడిషనల్ సూపరింటెండెంట్ మాధవయ్య పర్యవేక్షణ లో ఎస్సైలు అనిత, హారిక, పోలీస్ సిబ్బంది తో కలసి ధ్వంసం చేశారు.

# మూడు చింతలపల్లి లో అమ్మ మాట - అంగన్వాడి బాట కార్యక్రమం

శామీర్ పేట, (గరుడ వార్త ): అమ్మమాట అంగన్వాడి బాటలో భాగంగా భాగంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. శనివారం మండల కేంద్రం మూడు చింతపల్లి గ్రామంలో సెక్టర్ లెవల్ కార్యక్రమంలో భాగంగా చిన్నరులకు సామూహిక అక్షరాభ్యసం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ వెంకట నరసింహారెడ్డి



మాట్లాడుతూ రెండున్నర సంవత్సరాలు నిండిన చిన్నారులందరిని అంగన్వాడి కేంద్రాల్లో చేర్పించాలని, విద్యతో పాటు, పౌష్టికాహారం అందిస్తారని తెలిపారు. ఈ ఈ అవకాశం ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు . ఈ కార్యక్రమంలో ఐ సి డి ఎస్ సి డి పి ఓ ఉదయ శ్రీ, సూపర్ వైజర్ శారద, వివిధ గ్రామాల అంగన్వాడీ టీచర్లు, చిన్నారుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# విపత్తు వేళ.. పెద్దన్నలా సేవ

హైదరాబాద్ : రాజధానిలో ఎక్కడ, ఎలాంటి ప్రమాదం జరిగినా.. ముందుగా అక్కడికి చేరుకునేది జీహెచ్‌ఎంసీ డీఆర్‌ఎఫ్(విపత్తు స్పందన దళం) బృందాలే. జీహెచ్‌ఎంసీలో భాగమైన ఈవీడీఎం (ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్) కింద 2018లో ఏర్పాటై.. ఆది నుంచే నగరవాసులకు నేనున్నానంటూ భరోసా ఇస్తోంది డీఆర్‌ఎఫ్. ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఇది పనిచేస్తోంది. కంట్రోల్ రూముకు లేదా సామాజిక మాధ్యమాల ద్వారా అందే ఫిర్యాదులను అధికారులు డీఆర్‌ఎఫ్, ఈవీడీఎం వాట్సప్ గ్రూపులకు పంపిస్తారు. వెంటనే దగ్గర్లోని వాహనాలన్నీ అక్కడికి చేరుకుని సేవలు ప్రారంభిస్తాయి.

బృందాలు 30

మొత్తం సిబ్బంది 453

రోజుకు మూడు షిఫ్టుల్లో ఏడాది పొడవునా సేవలు

ఇప్పటి వరకు చేపట్టిన సహాయక కార్యక్రమాలు 13,198

కంట్రోల్ రూము నంబర్లు..

9000113667, 040– 2955 5500, 2956 0521, 2956 0528, 2956 0584, 2956 0591

ప్రాణాలు లెక్క చేయకుండా– ఎన్.ప్రకాశ్‌రెడ్డి, డైరెక్టర్, ఈవీడీఎం, జీహెచ్‌ఎంసీ

కాటేదాన్, జీడిమెట్ల, కాప్రా, ఉప్పల్ పారిశ్రామికవాడల్లో, బోయిగూడ, నాంపల్లి, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో జరిగిన అగ్ని ప్రమాదాల నుంచి డీఆర్‌ఎఫ్ సిబ్బంది వందల మందిని రక్షించారు. ఎలాంటి విపత్తునైనా వెనకడుగు వేయకుండా డీఆర్‌ఎఫ్ బృందాలు రంగంలోకి దిగుతాయి. ఏ ప్రమాదాన్ని ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై సిబ్బందికి నాగోల్ ఫతుల్లాగూడలోని శిక్షణ కేంద్రంలో తర్ఫీదు ఇచ్చాం. అక్కడ పాటించే ప్రమాణాలను ఎన్‌డీఆర్‌ఎఫ్ సైతం మెచ్చుకుంది. సీపీఆర్ చేయడంలోనూ శిక్షణ ఇచ్చాం.

# ముందు ఉదాసీనం.. తర్వాత క్రియాశీలం

ఆసిఫాబాద్: రెండేళ్ల కిందట ఈ ప్రాంతమంతా అడవే. ప్రస్తుతం పూర్తిగా పంట చేలుగా మారింది. లింగాపూర్, తిర్యాణి మండలాల్లో ఈ విధంగా యథేచ్ఛగా అడవుల నరికివేత, పోడు సాగు భారీగా సాగుతోంది. పచ్చని వన సంపద మైదానంలా మారుతోంది. రెండు, మూడు సంవత్సరాల క్రితం ఉన్న దట్టమైన అడవులు పంట పొలాలుగా మారుతున్నాయి. నరికే సమయంలో ఉదాసీనంగా ఉన్న అటవీ అధికారులు సాగు చేసుకునే సమయంలో ఉరుములేని పిడుగులా విరుచుకుపడి పంట భూములను స్వాధీనం చేసుకుంటామని హడావుడి చేయడం జిల్లాలో పరిపాటిగా మారింది. పోడు సాగు చేసుకునే రైతుల భూముల నుంచి తప్పకుండా కొంత భాగం తీసుకోవాలని ఉన్నతాధికారులు కిందిస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేయడంతో.. వీరంతా తలలు పట్టుకుంటున్నారు. విత్తనాలు వేస్తున్న రైతుల వద్దకు వెళ్లి భూమి తిరిగి ఇవ్వాలని కోరడంతో.. జిల్లా వ్యాప్తంగా ఏదో చోట ఆందోళనలు జరుగుతున్నాయి.

జిల్లాలోని లక్ష ఎకరాల్లో పోడు సాగుతుందని అంచనా. మొదట గిరిజనులు సాగు చేసినా, వివిధ కారణాలతో వారి భూములు ఇతరుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయి. అనంతరం వీరు అడవిని నాశనం చేస్తూ



పోడును విస్తరిస్తున్నారు. మరికొన్ని చోట్ల ఆదివాసీలనే ముందుంచి వనాన్ని నరికేసి బడా బాబులు సాగుకు ఉపక్రమిస్తున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు కాసుల యావతో ఇబ్బడిముబ్బడిగా పట్టాలు అందించారు. దీంతో పట్టాలున్న భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి. అటవీ, రెవెన్యూ సరిహద్దు వివాదాలు కొలిక్కిరాక పోవడం, అటవీ భూములకు పట్టాలు జారీ కావడంతో ఏటా ఈ వ్యవహారం జఠిలంగా మారుతోంది. జిల్లాలో 11 రేంజ్‌లు ఉండగా, ఒక్కో దాని నుంచి 150 ఎకరాల చొప్పున మొత్తం 12,650 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవాలని డీఎఫ్ఓ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అందరికీ పట్టాలు...

కాగజ్‌నగర్ మండలంలోని అంకుసాపూర్ సర్వే నం.145లో 600 ఎకరాల భూమి ఉంది. రైతులకు 199 ఎకరాల్లో మాత్రమే రెవెన్యూ భూమి ఉందని అటవీ అధికారులు చెబుతున్నారు. దాదాపు నాలుగు వందల ఎకరాల అటవీ భూమి పూర్తిగా పొలాలుగా ఉన్నాయి. వీటికి పట్టాలున్నాయి. ఈ ప్రాంతంలో పులి కదలికలు ఉన్నాయి. ఇటీవల అధికారులు భూమిని తీసుకుందామని వెళ్లేసరికి రైతులతో వాగ్వాదం జరిగింది. పట్టా పాస్ పుస్తకాలతో రైతులు ఆందోళనకు దిగారు.

అన్ని మండలాల్లోనూ...

ఇటిక్యాలపహాడ్ మాదిరిగానే ఆసిఫాబాద్ మండలం దానాపూర్‌లో సైతం రైతులతో అటవీ అధికారులకు నిత్యం వాగ్వాదం జరుగుతోంది. భూములన్నింటినీ తిరిగి ఇచ్చేయాలని అధికారులు చెప్పడంతో.. గ్రామస్థులు ఆందోళన చేస్తున్నారు. పెంచికల్‌పేట్, బెజ్జూర్, చింతల మానేపల్లి, రెబ్బెన మండలాల్లోని పలు ప్రాంతాల్లో ఇదే సమస్య ఉంది. ఇరువైపులా వాదనలు.. మహారాష్ట్రలోని తడోబా అభయారణ్యాల నుంచి పులులు ఎక్కువగా సిర్పూర్(టి) మండలం ఇటిక్యాలపహాడ్ గ్రామం నుంచి కాగజ్‌నగర్ అడవుల్లోకి ప్రవేశిస్తాయి. ఇక్కడి రైతులు దాదాపు 800 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మొదట 550 ఎకరాల వరకు భూములను తీసుకుంటామని చెప్పిన అధికారులు ప్రస్తుతం మొత్తం ఇవ్వాలని పట్టుపడుతున్నారు. ఈ విషయమై అధికారులు నిత్యం గ్రామస్థులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. భూములు ఇస్తే జీవనాధారం కోల్పోతామని వాపోతున్నారు. కుమురం భీం ప్రాజెక్టు పునరావాసంలో భాగంగా ఇక్కడ గ్రామస్థులకు పునరావాసం కల్పించామని, అక్కడే భూములు కోల్పోయిన వారికి పరిహారం అందజేశామని, ఈ రైతులం తా గిరిజనేతరులే అని అటవీ భూములపై వీరికి హక్కులు కల్పించలే మని అధికారులు పేర్కొంటున్నారు.

ప్లాంటేషన్ కోసం తీసుకుంటున్నాం నీరజ్‌కుమార్, డీఎఫ్ఓరెవెన్యూ భూముల పట్టాలు కలిగి ఉండి, అదనంగా పోడు సాగు చేసుకుంటున్న వారి భూములను తీసుకోవాలని పై నుంచి ఆదేశాలున్నాయి. ఒకచోట పరిహారం తీసుకుని భూములు కోల్పోయిన వారు మరోచోట ఇష్టానుసారంగా చెట్లను నరికేస్తూ పోడు చేసుకుంటున్నారు. ఇటువంటి వాటినే స్వాధీనం చేసుకుని మొక్కలు నాటుతాం.

## దూరభారం తప్పేలా.. సత్వర న్యాయం అందేలా

మందమర్రి : ప్రజలకు న్యాయం చేరువలో ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం మందమర్రిలో నూతనంగా న్యాయస్థానం ఏర్పాటు చేయనుంది. దీంతో రెండు మండలాల నుంచి మంచిర్యాల, బెల్లంపల్లి న్యాయస్థానానికి హాజరవుతున్న కక్షిదారులకు దూరం భారంతో పాటు ఆర్థిక భారం తప్పనుంది. అంతేకాకుండా త్వరితగతిన కేసులు పరిష్కారం కావడం వారికి ఉపశమనం లభించనుంది. జులై చివరి నాటికి సేవలు ప్రారంభం కానున్నట్లు సమాచారం.

పదేళ్ల నిరీక్షణకు తెరమందమర్రిలో న్యాయస్థానం ఏర్పాటు చేయాలనే ప్రక్రియ పదేళ్లుగా కొనసాగుతోంది. ఈ క్రమంలో అప్పటి జిల్లా న్యాయమూర్తి సైతం ఇక్కడ పలు సింగరేణి భవనాలు పరిశీలించారు. ప్రస్తుతం న్యాయస్థానం ఏర్పాటు ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేయడంతో మరోసారి తెరపైకి వచ్చింది. ఈ క్రమంలోనే సింగరేణి ఆధ్వర్యంలో ఉన్న సీఐఎస్ఎఫ్ శిబిరం భవనంతో పాటు కమ్యూనిటీ హాల్, సీఈఆర్‌క్లబ్ భవనాలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు పరిశీలించారు. జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానం ఏర్పాటుకు సీఐఎస్ఎఫ్ శిబిరం భవనం అనుకూలంగా ఉందని నిర్ణయానికి వచ్చారు. భవనం ఇచ్చేందుకు సింగరేణి సుముఖత చూపడంతో త్వరలోనే న్యాయస్థానం ఏర్పాటు కానుంది.

విచారణ దశలో మూడు వేల కేసులు మందమర్రి సర్కిల్ పరిధిలోని నాలుగు పోలీస్‌స్టేషన్‌లలో నమోదవుతున్న కేసులకు సంబంధించి కక్షిదారులు మంచిర్యాల, బెల్లంపల్లి న్యాయస్థానాల్లో జరుగుతున్న విచారణకు హాజరవుతున్నారు. ఇక్కడి న్యాయస్థానం ఏర్పాటుతో రెండు మండలంలోని ప్రజలకు, కక్షిదారులకు ఆర్థికంగా, రవాణా భారం తగ్గి సమయం ఆదా అవుతుంది. ప్రస్తుతం నాలుగు పోలీస్‌స్టేషన్ల పరిధిలోని మూడు వేల కేసులు న్యాయస్థానాల్లో విచారణ దశలో ఉన్నట్లు సమాచారం.

# ఆగస్టుపైనే ఆశలు..!



గరిడేపల్లి : సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు రైతుల్లో సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి. ఎగువ జలాశయాలకు నీటి ప్రవాహాలు పెరుగుతుండటంతో ఆగస్టులో నీరు వస్తుందనే నమ్మకం పెరుగుతోంది. అందుకు అనుగుణంగా సాగుకు ప్రయత్నాలు ప్రారంభిస్తున్నారు. ఇప్పటికే బోర్లు, బావుల కింద నార్లు పోసుకొని సాగుకు సమాయత్తమయ్యారు. సాగర్ నీరే అధారంగా సాగుచేసే రైతులు నార్లు పోసుకోవడానికి సన్నద్ధమవుతున్నారు. గత రెండు రోజులుగా ఆలమట్టికి వస్తున్న వరద, నీటి విడుదల, పశ్చిమ కనుమల్లో భారీ వర్షాలు, ఆలమట్టికి మరింత వరద పెరిగే అవకాశం ఉందనే వార్తలతో రైతుల నోట ఇదే చర్చనీయాంశంగా మారింది. ఎగువ జలాశయాలకు జలకళ..సాగర్ ఎడమ కాల్వ ఆయకట్టులో ఎక్కువగా ఆగస్టులోనే నీరు విడుదల చేసిన సందర్భాలు ఉన్నాయి. ఈసారీ అదే పరిస్థితి ఏర్పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతేడాది వర్షాలు లేకపోవడంతో పాటు ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర కరవు ఛాయలు ఏర్పడ్డాయి. ఇప్పుడు కాస్త ఊరటనిచ్చేలా కొన్ని ప్రాంతాలలో వర్షాలు పడుతుండటంతోపాటు మహారాష్ట్ర, కర్ణాటకలలో ఎక్కువగా కురుస్తున్నాయి. దాంతో ఎగువ జలాశయాలకు జలకళ కన్పిస్తోంది.

ప్రస్తుత పరిస్థితి ఇలా..

ఆలమట్టి జలాశయానికి లక్ష క్యూసెక్కుల కంటే ఎక్కువగానే వరద వస్తోంది. మొత్తం 129 టీఎంసీల సామర్థ్యం ఉన్న ఈ డ్యాంకు ఇప్పటికే 100 టీఎంసీల నీరు వచ్చి చేరింది. ఇంతకంటే ఎక్కువ నిల్వ చేయడానికి ఇబ్బంది. ఎత్తు పెంచుతున్న పనులు జరుగుతుండటంతో నీటి నిల్వ ఎక్కువగా చేస్తే ముంపు గ్రామాలకు ఇబ్బంది. అందుకే నీటి నిల్వను తక్కువగా ఉంచుతూ కిందకు వదులుతున్నారు. ఇంకా 20 టీఎంసీలు నిండాల్సి ఉన్నా ఎగువ వరదతో పాటు బ్యాక్ వాటర్ సమస్యతో అధిక మొత్తంలో కిందకు వదులుతున్నారు. ఆ తర్వాత డ్యాంలు నారాయణపూర్‌లో 37.64 టీఎంసీల సామర్థ్యం కాగా ఇప్పటికే 28 టీఎంసీలు నిల్వ ఉంది. తుంగభద్రలో నీటి నిల్వ సామర్థ్యం 105 టీఎంసీలు కాగా ప్రస్తుతం 36 టీఎంసీలు నీరుంది. వీటికి తోడు కృష్ణానదికి ఉప నదులుగా ఉన్న బీమా, కగ్ని, సిన వంటి అనేక ఉప నదులలో సైతం ప్రవాహాలు అనుకూలంగా ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రవాహాలు ఇలాగే కొనసాగడంతో పాటు వర్షాలు మరోసారి భారీగా ఉంటే జులై చివరి నాటికి శ్రీశైలం నిండి సాగర్‌కు వరద ప్రవాహం వచ్చే అవకాశం ఉంది.

# పంచాయతీ పాలన.. తప్పని వేదన!

మెదక్ : పల్లెపాలనలో కీలకమైన పంచాయతీలకు సొంత భవనాలు లేవు. ఆరు బయట, ఇరుకు గదుల్లో సమావేశాలను నిర్వహిస్తున్నారు. పలు చోట్ల నిర్మాణాలకు నిధులు మంజూరైనా పనులు ముందుకు సాగడం లేదు. ఆర్థిక సంఘం నిధులు రాక, కార్మికులకు వేతనాలు చెల్లించలేక కొట్టుమిట్టాడుతుండగా, భవనాల కోసం నిరీక్షిస్తూ అవస్థలు పడుతున్నారు. జిల్లాలో పరిస్థితిపై పరిశీలన కథనం.

జిల్లాలోని 21 మండలాల్లో 469 పంచాయతీలున్నాయి. కొత్తగా ఏర్పడిన వాటికి అంగన్‌వాడీ, సామాజిక భవనాలే దిక్కవుతున్నాయి. పాత వాటిల్లోనూ సొంత భవనాలు లేవు. ప్రస్తుతం పత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. వీరైనా చొరవ చూపితే ప్రయోజనం చేకూరనుంది. జిల్లాలో సొంత భవనాల కోసం ఉపాధి పథకం ద్వారా నిధులు మంజూరు అయ్యాయి. 20 మండలాల్లో 134 పంచాయతీలకు రూ.20 లక్షలు చొప్పున రూ.26.80 కోట్లు కేటాయించారు. వీటిలో ఇప్పటి వరకు కేవలం పదిచోట్ల మాత్రమే పనులు పూర్తయ్యాయి. 88 పంచాయతీల్లో పురోగతిలో ఉండగా, 36 చోట్ల పనులను ప్రారంభించక పోవడం గమనార్హం. పనులు చేపట్టినా బిల్లులు రాకపోవడంవల్ల గుత్తేదారులు ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా పనులు మందకొడిగా సాగుతున్నాయి.

నత్తనడకన: చేగుంట మండలంలో 28, నార్సింగి మండలంలో తొమ్మిది పంచాయతీలున్నాయి. చేగుంట మండలం కసాన్‌పల్లి, కరీంనగర్, రాజ్యతండా, ఇబ్రహీంపూర్, నడిమితండా, బి,కొండాపూర్, నార్సింగి మండలం భీంరావుపల్లిలో భవనాలు లేవు. ఆయా ప్రాంతాల్లో నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. రాజ్య తండాలో పనులు ప్రారంభించలేదు. మిగతా మూడు చోట్ల భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. భీంరావుపల్లిలో నాలుగేళ్లుగా పనులు సాగుతున్నాయి.

కార్యాలయాన్ని పాఠశాలలో నిర్వహిస్తున్నారు.

స్థలం కొరత: వెల్దుర్తి ఉమ్మడి మండలంలో 30 పంచాయతీలుండగా, పదింటికి సొంత భవనాలు లేవు. రామంతపూర్ తండా, బొమ్మారం, అచ్చంపేట, మహమ్మద్‌నగర్ తండా, శంశిరెడ్డిపల్లి తండా, చెర్లపల్లి, ఆరెగూడెం, రామాయపల్లిలో భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. రామంతాపూర్‌తండా, బొమ్మారం, అచ్చంపేటల్లో స్థలం కొరత ఉండడంతో పనులు చేపట్టలేదు. బస్వాపూర్, స్టేషన్ మాసాయిపేటకు నిధులు మంజూరు కాలేదు.

పాఠశాలల్లో కొనసాగింపు: అల్లాదుర్గం మండలంలో 16 పంచాయతీలున్నాయి. నడిమితండా, గొల్లకుంటతండా, సీతానగర్ గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్నాయి. అద్దె చెల్లిస్తూ..: హవేలిఘనపురం మండలంలో 28 పంచాయతీలున్నాయి కొత్తగా ఎనిమిది ఏర్పడగా వాటిని సామాజిక, అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. శమ్నాపూర్, కొత్తపల్లి పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరడంతో భవనాల నిర్మాణానికి పనులు ప్రారంభించారు. రేగోడ్ మండలంలో ఆరింటికి సొంత భవనాలు లేవు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో కొనసాగుతున్నాయి.మహిళా సమాఖ్య భవనంలో: పాపన్నపేట మండలంలో 36 పంచాయతీలున్నాయి. కుర్తివాడ, దౌలాపూర్ గ్రామాలకు మినహా, అన్నింటికి భవనాలున్నాయి. కుర్తివాడలో మహిళా సమాఖ్య భవనంలో కార్యాలయం కొనసాగుతోంది. దౌలాపూర్‌లో అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు.

పనులు చేపట్టక..: శివ్వంపేట మండలంలో 21 గ్రామాలకు భవనాలున్నాయి. 16 గ్రామాలకు నిధులు విడుదల అయ్యాయి. సికింద్లాపూర్‌లో పూర్తికాగా, దంతాన్‌పల్లి, చెన్నాపూర్‌లో నిలిచాయి. చాలా చోట్ల చేపట్టలేదు.

# శిథిల ఇళ్లతో భయం



కరీంనగర్: నాగర్‌కర్నూల్ జిల్లా వనపట్లలో ఇంటి పైకప్పు కూలి తల్లి, ముగ్గురు పిల్లలు చనిపోవడం అందరినీ కలిచి వేసింది.. మరమ్మతుల విషయంలో అప్రమత్తంగా లేకపోవడంతో నాలుగు నిండు ప్రాణాలు పోయాయి.. ఈ ఘటన ఉమ్మడి జిల్లావాసులను కలవరపరిచింది. వానలు పడుతున్నాయంటే.. జనావాసాల మధ్య ఉన్న శిథిల భవనాలు ఆందోళన పెంచుతున్నాయి. కరీంనగర్, రామగుండం కార్పొరేషన్‌లతోపాటు 14 పురపాలికలు, 1,218 పంచాయతీల్లో వేలాది భవనాల గోడలు బీటలు వారి, పైకప్పు పెచ్చులూడి ప్రమాద ఘంటికల్ని మోగిస్తున్నాయి. జనాలకు ఆర్థిక ఇబ్బందులతో కొత్త ఇళ్లను నిర్మించుకునే పరిస్థితి లేకపోవడం.. మరమ్మతులు చేయించుకోకపోవడంతో ఆ భవనాల్లోనే బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. కొన్ని ప్రభుత్వ భవనాలు కూడా శిథిలావస్థలో ఉండి అందులో పని చేసే ఉద్యోగులను కలవర పెడుతున్నాయి. వర్షాకాలం ప్రారంభంలో శిథిల భవనాల గుర్తింపు ప్రక్రియ సాగుతున్నా అది మొక్కుబడిగానే అన్న అభిప్రాయం ఉంది. శిథిల భవనాల పక్కన ఉన్నవారు సమాచారమిస్తున్న సందర్భంలో మాత్రమే అధికారులు సంబంధిత ఇళ్ల యజమానులకు 'ప్రమాదకరంగా ఉన్నవి, కూల్చివేసుకోవాల'ని నోటీసులు ఇస్తున్నారు. గత వర్షాకాలం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50-60 ఇళ్లకు ఇలా నోటీసులివ్వగా యజమానులు కూల్చివేసుకున్నట్లు అధికారిక గణాంకాల్లో ఉంది. ప్రభుత్వ భవనాలు, వాణిజ్య సముదాయాలు, నివాసగృహాలు ఇలా అన్ని కలిపి అత్యంత ప్రమాదకరమున్నవి దాదాపుగా 2-3వేల వరకుంటాయని అంచనా. కానీ అధికారులు మాత్రం వారికున్న నిబంధనల ప్రకారం నిర్మాణం చేపట్టిన ఏడాది, గరిష్ఠంగా ఎంతకాలం మన్నుతుందనే అంచనాలతో వాటి శిథిలావస్థను గుర్తిస్తున్నారు. గతేడాది వానాకాలంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉధృతంగా కురిసిన వర్షాలు, పారిన వరదల కారణంగా పాత ఇళ్లు, పెంకుటిల్లు 458 కూలిపోయాయి. అందులో పైకప్పు, గోడలు, పాక్షికంగా కూలినవే ఎక్కువ. కూలిన సందర్భంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. కరీంనగర్ నగరపాలక సంస్థ నగరంలో 107 మంది యజమానులకు నోటీసులు అందించింది. వారి ఇళ్లు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయని.. వాటిని ఎట్టి పరిస్థితుల్లో నేలమట్టం చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందులో తక్షణం కూల్చాల్సిన వాటితోపాటు పాక్షికంగా మరమ్మతులు చేయాల్సిన వాటి వివరాల్ని కూడా సిబ్బంది తెలియజెప్పారు. కాగా ఇందులో 20 మంది వరకు ఇళ్లు కూల్చివేశారు. ఇంకో 19 ఇళ్లకు అవసరమైన మరమ్మతులు చేసుకున్నారు. రామగుండం కార్పొరేషన్‌లో కేవలం 22 ఇళ్లకు నోటీసులివ్వగా అందులో మూడు ఇళ్లు మాత్రమే కూల్చివేశారు. మిగతా పురపాలికలన్నింటా కలిపి దాదాపుగా 250 వరకు గుర్తించి తాఖీదులివ్వగా అందులో పదిశాతం కూడా కూల్చివేసుకోలేదు.

పేదరికంతో ప్రత్యామ్నాయం లేక..శిథిలావస్థ ఇళ్లలో ఎక్కువగా ఉండేది పేదలు, దిగువ మధ్య తరగతి వారే. ఇల్లు కూల్చివేసుకోవాలన్నా.. పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాలన్నా ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి. దీంతో చాలామంది తాత్కాలిక మరమ్మతులతో సరిపుచ్చుకుంటూ అందులోనే నివసిస్తున్నారు.ఇళ్లు శిథిలావస్థ ఉంటే నోటీసులు ఇవ్వడం తప్పితే వాటి మరమ్మతులకు నిధులు మంజూరు చేసే అధికారం స్థానిక అధికారులకు లేదు. దీంతో వారు కూడా ఇళ్ల యజమానులపై ఒత్తిడి తేలేకపోతున్నారు.భారీ వర్షాలు పడినప్పుడు గ్రామాల్లో అధికారులు పునరావాస చర్యలు చేపట్టడంతో కొద్ది రోజులు అక్కడ ఉంటున్న పేదలు మళ్లీ వర్షాలు తగ్గాక తాత్కాలిక మరమ్మతులు చేసుకుని అందు లోనే ఉంటున్నారు. సొంత ఇళ్లు లేనివారు, శిథిలావస్థ ఇళ్లలో ఉంటున్నవారు ప్రభుత్వానికి ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నా పూర్తిస్థా యిలో వారికి కేటాయించకపోవడంతో వారు ఉన్న ఇళ్లలోనే సర్దుకుపో తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రెండు పడక గదులకు శ్రీకారం చుట్టినా చాలా చోట్ల ఇంకా కేటాయించలేదు. కొత్తగా ఏర్పడిన ప్రభు త్వం ప్రజా పాలన కార్యక్రమ ంలో ఇళ్ల కోసం దరఖాస్తులు ఆహ్వానించగా లక్షల్లో దరఖాస్తులు వచ్చాయంటే జనం సొంతింటి కోసం ఎంతగా ఎదురు చూస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. : అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి పూర్తి శిథిలమైన ఇళ్లలో ఉంటున్న వారికి అవగాహన కల్పించి ప్రత్యామ్నాయ నివాసం ఏర్పాటు చేసుకునేలా చూడటంతోపాటు వారు అర్హులైతే ప్రభుత్వం నుంచి ఇల్లు మంజూరు చేయించి ఇస్తే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపినట్లవుతుంది.కరీంనగర్ కలెక్టరేట్‌లో అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని అధికారులు, సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక్కడ ఉన్న దాదాపు 16 విభాగాల కార్యాలయాలన్నీ పాత కలెక్టరేట్ భవనంలో నడుస్తున్నాయి. పైకప్పు ఊడిపోయి, గోడలు బీటలు వారి ఎప్పుడు ఏది ఊడిపడుతుందో తెలియని పరిస్థితుల్లో ఇక్కడి సిబ్బంది బిక్కుబిక్కుమంటున్నారు. పై కప్పు ఉరుస్తుండటంతో కింద డబ్బాలు పెట్టి వాన నీళ్లను పడుతున్నారు. పైగా తడిసిన గోడలతో చాలా గదులు ఎప్పుడు కూలిపోతాయోననే భయం మాత్రం వీరిని వెంటాడుతోంది.

# ఉద్యాన కళాశాలపై ఆశల ఊసులు

అశ్వారావుపేట : 'కొత్తగా విధుల్లో చేరిన ఉద్యాన, వ్యవసాయ అధికారులకు ఇదో శిక్షణ కేంద్రం.. శాస్త్రవేత్తలకు అధ్యయన కేంద్రం.. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల రైతులకు ఉద్యాన పర్యాటక, విజ్ఞాన కేంద్రం' మొత్తంగా తెలంగాణ ఉద్యాన నర్సరీల కేంద్రంగా ప్రసిద్ధిగాంచిన అశ్వారావుపేట ప్రాంతంలో ఉద్యాన కళాశాల ఏర్పాటుపై ఆశలు చిగురిస్తున్నాయి. ఇటీవల ఇక్కడికి వచ్చిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉద్యానశాఖ కమిషనర్, టీజీ ఆయిల్‌ఫెడ్ ఎండీలు అశ్వారావుపేటలో ఉద్యాన కళాశాల ఏర్పాటుపై ప్రతిపాదనలు రూపొందించనున్నట్లు ప్రకటించారు. ఉద్యాన కళాశాల ఏర్పాటుపై ఆశలు చిగురిస్తున్నాయి.

తెలంగాణలో ప్రస్తుతం కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో రాజేంద్రనగర్, మహబూబ్‌నగర్ జిల్లా మోజెర్ల,



మహబూబాబాద్ జిల్లా మల్యాలలో ఉద్యాన కళాశాలలున్నాయి. ఆయా ప్రాంతాల్లో ఉద్యాన క్షేత్రాలు అంతంతమాత్రమే. అశ్వారావుపేట ప్రాంతంలో ఉద్యాన క్షేత్రాలు, పరిశోధన కేంద్రాలూ ఉన్నాయి. ఇక్కడ ఉద్యాన కళాశాల ఏర్పాటుకు ఎంతో అనుకూలం.

అశ్వారావుపేటలో 1989లోనే వ్యవసాయ కళాశాల ఏర్పాటైంది. కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఉద్యాన పరిశోధన కేంద్రం, అటవీ పరిశోధన కేంద్రం, ఉద్యానశాఖ ఆధ్వర్యంలో ఉద్యాన నర్సరీలు, కొబ్బరి విత్తనోత్పత్తి క్షేత్రం, పట్టుపరిశ్రమ కేంద్రాలు ఇప్పటికే ఉన్నాయి. ఆయిల్‌పాం కేంద్రీయ నర్సరీ, అశ్వారావుపేట, అప్పారావుపేటలో పామాయిల్ పరిశ్రమలు, అశ్వారావుపేట నియోజకవర్గంలోనే సుమారు 500లకు పైగా ఉద్యాన నర్సరీలు ఉన్నాయి.

ఆధునిక పంటలకు నిలయం..

సంప్రదాయ పంటలకు తోడు ఆధునిక పంటలు సాగు చేసే ఔత్సాహిక రైతులు పలువురు ఉన్నారు. మామిడి, జీడిమామిడి, జామ, అరటి లాంటి పంటలే కాకుండా ఆయిల్‌పాం, కొబ్బరి, కోకో, యాపిల్‌బేర్, జాజికాయ, కోకో, స్టార్‌ఫ్రూట్ వంటి పంటలనూ పండిస్తున్నారు. శాస్త్రవేత్తలకు దీటుగా ప్రయోగాలు చేసే రైతులూ ఉన్నారు.

## ఆగస్టులోగా.. గుడుంబా రహిత జిల్లాగా..

కొత్తగూడెం : జిల్లాలో ఇంకా గుడుంబా గుప్పుమంటూనే ఉంది. అక్కడక్కడా నాటుసారా స్థావరాలు కొనసాగుతున్నాయి. ఇటీవల అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా నిర్వహించిన విస్తృత దాడుల్లో పలువురు పట్టుబడ్డారు. కొందరు యువకులనూ అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో నాటుసారాను తుదముట్టించాలని ప్రభుత్వం తాజాగా సంకల్పించింది. కేసులు అత్యధికంగా నమోదవుతున్న ఏజెన్సీ జిల్లాలో తయారీని వంద శాతం నిలువరించాలని ఆబ్కారీ శాఖ అధికారులు కార్యాచరణకు పూనుకున్నారు.

ప్రత్యేక బృందం ఏర్పాటు..

ప్రభుత్వ నిర్ణయం మేరకు వచ్చే ఆగస్టు నాటికి సారా మహమ్మారిని పూర్తిగా నియంత్రణలోకి తేవాలని అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ నేతృత్వంలో జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు గుర్తించిన హాట్‌స్పాట్స్ ఎన్ని ఉన్నాయి? తయారీదారులపై ఏఏ చర్యలు చేపట్టాలి? నాటుసారా రహిత గ్రామాలుగా మార్చేందుకు అవగాహన కార్యక్రమాలు ఎలా నిర్వహించాలో చర్చిస్తున్నారు. ప్రత్యేక బృందాలతో లక్ష్యాన్ని చేరుకుంటామని ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య 'న్యూస్‌టుడే'కు తెలిపారు.హాట్‌స్పాట్‌లపై విస్తృత దాడులు

కొత్తగూడెం, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, జూలూరుపాడు, అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, పాల్వంచ, ములకలపల్లి, అశ్వారావుపేట, దమ్మపేట, భద్రాచలం, బూర్గంపాడు, దుమ్ముగూడెం, చర్ల, మణుగూరు, పినపాక, కరకగూడెం, అశ్వాపురం, ఇల్లెందు, టేకులపల్లి, గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో ఇప్పటివరకు 64 హాట్‌స్పాట్స్‌ను అధికారులు గుర్తించారు. దాడులు నిర్వహించి ఇప్పటివరకు 27 మూసివేయించారు. మరో 37 స్థావరాలపై చర్యలు తీసుకోవాల్సి ఉంది. వివిధ కేసులకు సంబంధించి 71 మంది నేరస్థులను గుర్తించగా.. బైండోవర్‌లో సుమారు 764 మంది ఉన్నారు.

## కేటీపీఎస్ మరమ్మతుల్లో వేగం

పాల్వంచ : వర్షాలు జోరందుకున్న తరుణంలో వ్యవసాయ విద్యుత్తుకు డిమాండ్ పెరుగుతోంది. రాష్ట్ర గ్రిడ్‌లో కీలకమైన కేటీపీఎస్ విద్యుత్తు సరఫరాలో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ క్రమంలో.. అయిదో దశ కర్మాగార వార్షిక మరమ్మతులను గడువులోపే పూర్తిచేసేలా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ప్లాంట్‌ను జెన్కో 'థర్మల్' డైరెక్టర్ లక్ష్మయ్య సందర్శిస్తూ నిపుణులతో సమీక్షిస్తున్నారు.

కేటీపీఎస్ అయిదో దశ కర్మాగార పదో యూనిట్ పూర్తి విద్యుదుత్పత్తి సామర్థ్యం 250 మెగావాట్లు. గత నెల 15న ప్లాంటు వార్షిక మరమ్మతులు ప్రారంభించారు. జులై నెలాఖరు నాటికి, మొత్తం 45 రోజుల వ్యవధిలో పనులు పూర్తి చేయాలని గుత్తేదారు సంస్థ బీహెచ్ఈఎల్‌తో జెన్కో యాజమాన్యం ఒప్పందం చేసుకుంది. ఇప్పటికే నెల రోజుల గడువు ముగిసింది. టీఎస్ జెన్కో థర్మల్ డైరెక్టర్ బాదావత్ లక్ష్మయ్య ఇటీవల మరమ్మతుల పురోగతిపై సమీక్షించారు. అధికారులు, బీహెచ్ఈఎల్ నిపుణులు, ఇంజినీర్లకు దిశానిర్దేశం చేశారు. సీఈ మేక ప్రభాకర్‌రావు పర్యవేక్షణలో, సీమెన్స్ సంస్థ, బీహెచ్ఈఎల్, కేటీపీఎస్ కర్మాగారం ఉద్యోగులు సుమారు 1,000 మంది పనుల్లో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం నూతన ఎయిర్ ప్రీ హీటర్‌ను బిగిస్తున్నారు. బాయిలర్ ట్యూబ్ లీకులను సరిచేస్తున్నారు. టర్బైన్, జనరేటర్ మరమ్మతుల, ఓవరాయిలింగ్ పనులు జరుగుతున్నాయి. గడువు లోపే పనులన్నీ పూర్తిచేయాలని ప్లాంటు అధికారులు ప్రయత్నిస్తున్నారు.

పురోగతిపై రోజు వారీగా సమీక్ష

– మేక ప్రభాకర్‌రావు, సీఈ, విద్యుత్కేంద్రం

భెల్, కేటీపీఎస్ ఇంజినీరింగ్ అధికారులు, నిపుణుల సమష్టి కృషితో నెలాఖరులోగా పనులు పూర్తయ్యేలా చూస్తాం. మరమ్మతులపై రోజువారీగా సమీక్ష చేస్తున్నాం. జులై నెలాఖరులోపే రాష్ట్ర గ్రిడ్‌కు యూనిట్‌ను అనుసంధానిస్తాం.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో సంస్కరణలు

కరీంనగర్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో మార్పు తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దడానికి అవసరమైన చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ ఆదేశాలను అమలు చేసేలా అధికారులు కార్యాచరణ మొదలుపెట్టారు. కొన్ని రోజుల కిందట సరళ భాషలో విద్యా బోధనకు నూతన పుస్తకాలను ముద్రించారు. వాటి బోధనకు హైదరాబాద్‌లో కొంతమంది ఎంపిక చేసిన అంగన్‌వాడీ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. అక్కడ శిక్షణ పొందిన వారు మిగిలిన వారికి శిక్షణ ఇచ్చే పనిలో ఉన్నారు. తాజాగా పూర్వ ప్రాథమిక విద్యకు కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఏకరూప దుస్తులు అందించేందుకు అవసరమైన వస్త్రాలు సైతం ఇటీవల జిల్లా సంక్షేమ కార్యాలయానికి చేరాయి.

రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రకమైన బోధన

జిల్లాలో 777 అంగన్‌వాడీ కేంద్రాల్లో వాటి పరిధిలో మూడు నుంచి ఆరేళ్లలోపు కేంద్రాలకు వచ్చే వారిలో 20,507 మంది చిన్నారులున్నారు. ముందుగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఆవరణలో ఉన్న



అంగన్‌వాడీ కేంద్రాల పిల్లలకు ఏకరూప దుస్తులు అందించనున్నారు. వాటిని కుట్టే బాధ్యతను జిల్లా డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో పని చేస్తున్న మహిళా సంఘాలకు అప్పగించనున్నారు. ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున అంగన్‌వాడీ బాలలకు అప్పగిస్తారు. సరళ పదాలతో అంగన్‌వాడీ పిల్లలకు ప్రత్యేక సిలబస్‌తో రూపొందించిన పాఠ్య పుస్తకాలు సైతం జిల్లాకు చేరాయి. వీటిని త్వరలోనే అప్పగించనున్నారు. పూర్వ ప్రాథమిక విద్య కరదీపిక, ప్రియదర్శిని-1 పేరుతో వెలువడిన పుస్తకాలతో రాష్ట్రవ్యాప్తంగా ఒకే విధంగా బోధన ఉండేలా చర్యలు చేపడుతున్నారు.బలోపేతానికి చర్యలు- ఎం.సరస్వతి, జిల్లా సంక్షేమ అధికారి అంగన్‌వాడీ కేంద్రాలను పటిష్ఠం చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. టీచర్లకు నూతన పుస్తకాల పంపిణీతోపాటు పిల్లలకు ఏకరూప దుస్తులను కుట్టించి పంపిణీ చేస్తాం. కేంద్రాలకు వచ్చే బాలలకు నాణ్యమైన బోధన, పౌష్టికాహారం అందించేందుకు చర్యలు చేపడుతున్నాం.

# అసంఘటిత రంగ కార్మికులే అధికం

పెద్దపల్లి : 'వలస కూలీలను పనిలో పెట్టుకొనే యాజమాన్యాలు వారి నడవడిక, నేర చరిత్ర గురించి స్వయంగా విచారణ నిర్వహించిన తర్వాతే ఉపాధి కల్పించాలి.' కార్మికుల నేర చరిత్ర తెలుసుకోవడం ద్వారా కొంతవరకు నేరాల నియంత్రణ సాధ్యమే అయినా ఉమ్మడి జిల్లాలో అసంఘటిత రంగ కార్మికులే అధికంగా ఉండటంతో సాధ్యాసాధ్యాలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు వలస కూలీల గణాంకాలు కార్మిక శాఖ వద్ద అందుబాటులో ఉండటం లేదు. ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ పనులు, భవన నిర్మాణ కూలీలు, పరిశ్రమల్లో పని చేసే సాంకేతిక నిపుణుల వరకు వివిధ రంగాల్లో 50 వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరిలో ఇటుకబట్టీల్లోనే పెద్దసంఖ్యలో కూలీలున్నట్లు అనధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

మారిన పరిస్థితులు

40 ఏళ్ల కిందట ఉమ్మడి జిల్లా నుంచి ఇతర రాష్ట్రాలు, దేశాలకు వలసలు ఎక్కువగా ఉండేవి. సాగునీటి వసతి అందుబాటులోకి రావడం, స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగవడంతో క్రమంగా తగ్గిపోయాయి. అదే సమయంలో పదేళ్లుగా ఇతర రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి ఉపాధి పొందే కార్మికుల సంఖ్య పెరుగుతోంది. ఇక్కడి పరిశ్రమలతో పాటు అసంఘటిత రంగంలో పొరుగు రాష్ట్రాలకు చెందిన వేలాది మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఇందులో ఇటుక బట్టీలు, బియ్యం మిల్లులు, గ్రానైట్ పరిశ్రమల్లోనే 80 శాతం మంది వలస కూలీలున్నారు.

స్పష్టమైన కార్యాచరణతోనే..

చిత్తశుద్ధి ఉంటే వలస కూలీల గణాంకాల సేకరణ, వారి నియంత్రణ పెద్ద సమస్యేమీ కాదు. కానీ ఏదైనా ఘటన జరిగినపుడే అధికారులు హడావుడి చేస్తూ మిగతా సమయాల్లో వదిలేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సీజన్‌ల వారీగా.. ఏడాది పొడవునా ఏయే రంగాల్లో వలస కూలీలు పని చేస్తున్నారో సంబంధిత శాఖల ద్వారా వివరాలు సేకరించడం సులభమవుతుంది. ఇటుక బట్టీలు, బియ్యం మిల్లులు, ఇతర పరిశ్రమల్లో పని చేసే కార్మికుల వివరాల కోసం యాజమాన్యాలు ఏటా పనులు ప్రారంభించే సమయంలోనే అధికారులు కూలీల వివరాలు సేకరించాలి. నిర్మాణ రంగ కార్మికులు, ఇతర రంగాల కూలీలు, వారిని నియమించుకున్న యజమానులను గుర్తించాలి. వారి ద్వారా వివరాలు సేకరించి, గుర్తింపు కార్డులు జారీ చేయాలి. కార్మిక శాఖ గుర్తింపు కార్డు జారీ చేసిన వారినే పనిలో పెట్టుకోవాలనే నిబంధనను కఠినంగా అమలు చేయాలి. దీంతో వలస కార్మికుల పూర్తి వివరాలు ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉంటాయి. తద్వారా వారి నేర చరిత్రను కూడా ఆరా తీసే అవకాశం ఉంటుంది. కాట్నపల్లి ఘటనలో పోలీసులు వేగంగా స్పందించడంతో నిందితుడిని పట్టుకోగలిగారు. లేదంటే నిందితుడి ఆచూకీ కూడా దొరికేది కాదు. ఈ ఘటనకు పాల్పడిన బిహార్ కూలీ వద్ద మధ్యప్రదేశ్‌కు చెందిన మరో వ్యక్తి ఆధార్ కార్డు లభించింది. సీసీ కెమెరా ఫుటేజీ కూడా నిందితుడిని గుర్తించేంతగా స్పష్టత లేదు. అనుమతి లేనివే అధికంఉమ్మడి జిల్లాలో వ్యవసాయాధారిత పరిశ్రమలైన బియ్యం మిల్లులు, గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించిన ఇటుక బట్టీలకు పరిశ్రమల శాఖ నుంచి అనుమతులు లేవు. పెద్దపల్లి జిల్లాలోని 150 బియ్యం మిల్లుల్లో కేవలం మూడింటికి మాత్రమే అనుమతి ఉండటం గమనార్హం. ఇక భవన నిర్మాణ కార్మికులు మినహా ఇతర అసంఘటిత రంగాల కార్మికులను గుర్తించే కనీస కార్యాచరణ కూడా కార్మిక శాఖ చేపట్టడం లేదు. వలస కార్మికుల సంక్షేమాన్ని కూడా ఆ శాఖ విస్మరించింది. గతంలో ఇటుక బట్టీలు, బియ్యం మిల్లులకే పరిమితమైన వలస కూలీలు కొన్నేళ్లుగా వ్యవసాయ పనులకూ వస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు, షాపింగ్ మాళ్లలో పని చేస్తున్నారు.నైపుణ్యం కలిగిన కార్మికులు భవన నిర్మాణం, ఇంటీరియర్ డిజైనింగ్, మగ్గం వర్క్, బంగారు ఆభరణాల తయారీ వంటి పనులు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పౌల్ట్రీ, డెయిరీలతో పాటు మిల్లుల్లో ఆపరేటర్లు, ట్రాక్టర్లు, హార్వెస్టర్ల డ్రైవర్లుగానూ పని చేస్తున్నారు.

# ఆస్పత్రుల్లో భద్రత ప్రశ్నార్థకం!

కరీంనగర్ : రోగులకు చికిత్స అందించే ఆస్పత్రుల్లో నిబంధనలు పట్టించుకోవడం లేదు.. అనారోగ్యమని ఆస్పత్రుల మెట్లు ఎక్కేవారి భద్రత ప్రశ్నార్థకమవుతోంది.. గత నెలలో దిల్లీలోని ఓ ఆస్పత్రిలో ఘోర ప్రమాదం జరిగినప్పటికీ ఉమ్మడి జిల్లాలో భద్రతా లోపాల్ని సవరించుకోవడం లేదు ఓ ప్రైవేటు ఆసుపత్రిలో షార్ట్‌సర్క్యూట్ అయి మంటలు రేగిన ఘటన మరోసారి భద్రతను ప్రశ్నార్థకం చేసింది.. నాలుగు జిల్లాల పరిధిలోని ప్రైవేటు ఆస్పత్రుల్లోని వసతుల తీరుపై గతేడాది అధికారులు తనిఖీలు చేపట్టారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా దాదాపు 1,186 ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నట్లు అప్పట్లో గుర్తించారు. దాదాపు 80 శాతం ఆస్పత్రుల్లో ఏదో ఒక లోపముందని గుర్తించిన అధికారులు 20 శాతం దవాఖానాలకు తాఖీదులు అందించారు. కానీ ఇప్పటి వరకు మళ్లీ ఆ ఆస్పత్రుల జోలికి వెళ్లిన దాఖలాలు లేవు. నిర్వహణ మొక్కుబడిగానే..ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉపకరణాల ఏర్పాటు, నిర్వహణ విషయంలో చాలా యాజమాన్యాలు మొక్కుబడిగా వ్యవహరిస్తున్నాయి. భవనం అనుమతుల నుంచి అడుగడుగునా నిబంధనల అతిక్రమణలే ఉంటున్నాయి. పర్యవేక్షణ అధికారుల్ని మచ్చిక చేసుకుని కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ముఖ్యంగా వైద్యారోగ్యశాఖతోపాటు పుర, నగరపాలక సంస్థలు, పోలీసు, అగ్నిమాపక, విద్యుత్తు శాఖ ఇలా పలు శాఖల నిరంతర పర్యవేక్షణ ఆస్పత్రులపై ఉండాలి. అగ్నిమాపక శాఖ వారు ప్రమాద నివారణ పరికరాలు అందుబాటులో ఉన్నాయా.. పని చేస్తున్నాయా పరిశీలించాలి. విద్యుత్తు శాఖ అధికారులు విద్యుత్తు ఉపకరణాలు నాణ్యమైనవే వాడుతున్నారా.. వారు అనుమతి తీసుకున్న కెపాసిటీ మేరకే వినియోగిస్తున్నారా.. వైరింగ్ ఎలా ఉంది తదితర విషయాలు పరిశీలించాలి. ఆస్పత్రుల్లో ఆక్సిజన్ సిలిండర్లు, జనరేటర్, విద్యుత్తు ఉపకరణాలు ప్రమాదాలకు కారణమయ్యే అవకాశము ంటుంది. ఇవన్నీ సరిగా ఉన్నాయా లేదా క్రమం తప్పకుండా ఆయా శాఖల అధికారులు పర్యవేక్షించాల్సి ఉండగా పట్టించుకోకపోవడం ప్రమాదాలకు కారణమవుతుందన్న ఆరోపణలున్నాయి. పైగా ఆస్పత్రిలో ఏ ఉపకరణాల్ని వాడుతున్నారనే విషయంలో లెక్కాపత్రం లేదని వైద్యఆరోగ్యశాఖకు చెందిన ఓ అధికారి చెప్పడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. సంబంధిత అధికారులు వెంటనే ఆస్పత్రులపై దృష్టి పెట్టి భద్రత విషయంలో చర్యలు తీసుకుంటేనే ప్రమాదాలు మున్ముందు జరగకుండా ఉండే అవకాశం ఉంది. ఈ విషయమై జిల్లా అగ్నిమాపక అధికారి వెంకన్నను సంప్రదించగా ప్రతి ఆసుపత్రిలో భద్రత ప్రమాణాలు పాటించడం యాజమాన్యాల బాధ్యత అన్నారు. తాము పలుమార్లు అవగాహన కల్పించామని, తనిఖీలు చేశామని.. నిబంధనల మేరకు లేని వాటికి నోటీసులు ఇచ్చామని చెప్పారు. మరోసారి అన్ని ఆస్పత్రులపై దృష్టి సారించి సూచనలు ఇస్తామన్నారు.

ప్రైవేటు దవాఖానాలో చెలరేగిన మంటలుకరీంనగర్‌లో గాయత్రి ఆసుపత్రిలోని ఒక గదిలో మంటలు చెలరేగడ ంతో రోగులు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. ఆసుపత్రి రెండో అంతస్తులో చికిత్స పొందేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఏసీ గది నుంచి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో గదిలో రోగులు లేరు. మంటలతో వ్యాపించిన పొగలను గుర్తించిన సిబ్బంది వెంటనే అప్రమత్తమై అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు.

# మత్తు వదిలించేందుకు.. కొత్త ఎత్తు



భువనగిరి : పట్టణాలు, గ్రామాలు మొదలుకుని ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతుంది. ఈ మహమ్మారి కట్టడికి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఈ క్రమంలోనే విద్యాలయాల్లోనూ నిలువరించే చర్యల్లో భాగంగా తాజాగా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఉన్నత పాఠశాలల్లో డ్రగ్స్‌ను అరికట్టేందుకు ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారుల ద్వారా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆయా ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఉత్తర్వులు అందాయి.

కట్టడి క్లబ్ ఏర్పాటు ఇలా..

క్లబ్ అధ్యక్షుడిగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లేదా ప్రిన్సిపల్ కొనసాగుతారు. ఉపాధ్యక్షుడిగా సీనియర్ ఉపాధ్యాయుడు లేదా చైల్డ్ ఫ్రెండ్లీ టీచర్, సభ్యులుగా 6-10 తరగతుల నుంచి ఇద్దరు చొప్పున క్రియాశీల విద్యార్థులు, 6-10 తరగతులకు సంబంధించిన విద్యార్థుల తల్లిదండ్రుల్లో నుంచి ఒక ప్రతినిధి, స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి సిబ్బంది ఒకరు సభ్యులుగా ఉంటారు. కమిటీ కార్యకలాపాల్లో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లనూ వినియోగించుకోవచ్చని ఆదేశించారు. క్లబ్ నిర్వహణకు సంబంధించి అతి త్వరలో మార్గదర్శకాలు జీరీ చేస్తామని సదరు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కమిటీ కార్యకలాపాలు ఇవీ..

మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన విద్యార్థులుంటే గుర్తించి వారిని అప్రమత్తం చేస్తారు. వాటి దుష్ప్రభావాలు వివరించి ఆ మహమ్మారి నుంచి దూరమయ్యేలా అవగాహన కల్పిస్తారు. వీటి అక్రమ రవాణాకు పిల్లల్ని ఉపయోగిస్తున్నట్లయితే తగిన జాగ్రత్తలు తీసుకుని కట్టడి చేసి సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం అందిస్తారు. పాఠశాల ఆవరణలో, చుట్టుపక్కలా ఏదైనా కార్యకలాపాలు, మాదకద్రవ్యాలు, పదార్థాల వినియోగం, అమ్మకం, అనుమానిత కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండేలా చేయడం కమిటీ చేపడుతుంది.

# ఉసురు తీసిన ఉత్సాహం



నల్గొండ : ఈత సరదా ముగ్గురి ప్రాణాలను మింగేయగా..పండగ పూట పుణ్యస్నానం ఆచరిద్దామని వచ్చిన వ్యక్తి, లోతు తెలియక నీటమునిగి మరణించారు. ఉమ్మడి జిల్లాలోని ఆత్మకూరు (ఎస్), నేరేడుగొమ్ము మండలాల్లో ఒకే రోజు జరిగిన ఈ ప్రమాదాలు బాధిత కుటుంబాల్లో తీవ్ర వేదనను నింపాయి. రెండు ప్రమాదాల్లో మూడు కుటుంబాల పెద్దలు మరణించడంతో ఆ కుటుంబాలు దిక్కులేనివయ్యాయి. వానాకాలం సీజన్ ప్రారంభమైనా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని చెరువులు, నీటి వనరుల్లోనే నీళ్లు ఉండటం, అందులో గతంలో మిషన్ కాకతీయలో భాగంగా మట్టి తీయడంతో గుంతలు ఏర్పడ్డాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఇవి తెలియకపోవడంతో నీట మునిగి తనువు చాలించారు. రెండు ప్రమాదాల్లోనూ మరణించిన వృశాంక (12), కృపరాజు (42), శ్రీపాల్‌రెడ్డి (44), జగదీశ్ (42)లు స్థానికులు కాకపోవడం గమనార్హం. స్థానికులైతే ఆయా ప్రాంతాల్లోని నీటి వనరులపై అవగాహన ఉంటుందని, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు సరదాకు దిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని నీటిపారుదల శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు.

సూచిక బోర్డులెక్కడ?

మరోవైపు క్వారీలు, చిన్ననీటి వనరులు, చెరువుల వద్ద అధికారులు ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం లేదు. దీంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. తాజా ఘటనల్లోనూ రెండు ప్రాంతాల్లో ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. క్వారీలపై పర్యవేక్షణ, నిఘాలో మైనింగ్ శాఖ విఫలమవుతోందని సంబంధిత ఉన్నతాధికారులే అభిప్రాయపడుతున్నారు. జిల్లాలోని నల్గొండ, దేవరకొండ, సూర్యాపేట, కోదాడ, ఆత్మకూరు, చౌటుప్పల్, బొమ్మలరామారం, భువనగిరి ప్రాంతాల్లో భారీగా కంకర క్వారీలున్నాయి. వీటిలో చాలా వాటికి అనుమతులు లేనివే ఉన్నాయి. కొన్ని మూత పడగా...అక్కడ ఏర్పడిన గుంతలను పూడ్చడంలో సదరు యజమానులు ఆసక్తి చూపడం లేదు. దీంతో వర్షాకాలంలో వాటిలో నీళ్లు నిలిచి ఎవరైనా సరదాకు ఈతకు దిగితే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నాగార్జునసాగర్‌లోనూ రోజురోజుకూ నీటి నిల్వలు పడిపోతున్నాయి. దీంతో హైదరాబాద్‌తో పాటూ పలు ప్రాంతాల నుంచి వారాంతాల్లో ఇక్కడకు వచ్చే వారికి ఎక్కడ ఏ గుంత ఉందో తెలియని పరిస్థితి. ఇటీవలి కాలంలో తరచూ ఇక్కడ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. నేరేడుగొమ్ము, చందంపేట ప్రాంతాల్లోని వైజాగ్ కాలనీ, పీఏ పల్లి మండలంలోని అజ్మాపురం ప్రాంతాలకు పర్యాటకులు వస్తున్న నేపథ్యంలో అధికారులు ఆయా ప్రాంతాల్లో ప్రమాద పరిస్థితులపై సూచిక బోర్డులతో పాటూ పలు భద్రతా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# ఇద్దరు ఉప ప్రధానార్చకుల బదిలీపై స్టే

భద్రాచలం : దేవాదాయశాఖలోని అర్చకుల బదిలీపై ఇంకా స్పష్టత రాలేదు. తాజా పరిస్థితులను పరిశీలిస్తే.. భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలోని ఇద్దరు ఉప ప్రధానార్చకులు అమరవాది మురళీకృష్ణమాచార్యులు, కోటి శ్రీమన్నారాయణాచార్యులు హైకోర్టును ఆశ్రయించడంతో వారిద్దరి బదిలీపై స్టే లభించింది. రామాలయంలో 30 మంది వైదిక ఉద్యోగులకు గాను 20 మంది అర్చకత్వంలో ఉన్నారు. వీరిలో వంశపారంపర్య అర్చకులు 15 మంది. హైకోర్టు స్టే నేపథ్యంలో దేవాదాయశాఖ కౌంటర్ దాఖలు చేయనుందని సమాచారం. ఆయా ఆలయాల సంప్రదాయాలను పరిగణనలోకి తీసుకొని అర్చకులను బదిలీ నుంచి మినహాయిస్తారా లేదా అన్నది కౌంటర్‌లో వెల్లడించే వీలుంది. ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న వేద పండితులు, పారాయణదారులు, స్థానాచార్యులు వంటి పోస్టుల్లో ఉన్న వైదిక ఉద్యోగులు స్టే తెచ్చుకున్న వారిని అనుసరించి న్యాయపోరాటం చేస్తారా? లేక ప్రభుత్వ నిర్ణయమే శిరోధార్యం అంటారా అన్నదే ఆసక్తి రేకెత్తిస్తోంది. భద్రాచలం రామాలయంలో భక్త రామదాసు అనువంశక అర్చకులను ప్రవేశ పెట్టారు. దీన్ని నాలుగు శతాబ్దాలుగా కాపాడుకుంటున్నారు. ప్రధాన కోవెలలోని ధ్రువమూర్తుల పూజలతో పాటు ముఖ్య ఉత్సవాల్లో వీరిదే కీలక పాత్ర. ఇలాంటి చోట అర్చకులను బదిలీ చేయటం సాధ్యమేనా అన్నది ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

# కొండెక్కిన కూరగాయలు

ఖమ్మం : కూరగాయల ధరలు కొండెక్కుతున్నాయి. ఖమ్మంలోని హోల్‌సేల్ వ్యవసాయ మార్కెట్ నుంచి ఖమ్మం నగరం, మధిర, వైరా, సత్తుపల్లి, కల్లూరు, ఏన్కూరు, కొత్తగూడెం, ఇల్లెందు, పాల్వంచ, భద్రాచలం, మణుగూరు, ములుగు, సూర్యాపేట, నల్గొండ, మహబూబాబాద్, ఏపీలోని ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల వ్యాపారులు కూరగాయలు కొంటారు. ప్రస్తుతం ఖమ్మం రైతుబజార్లలోనే ఎక్కువ ధరలు పలుకుతుంటే మిగతా ప్రాంతాల్లో చిరువ్యాపారుల దగ్గర మరింత మండిపోతున్నాయి.

వేసవి ప్రభావం వేసవి కారణంగా దిగుబడులు తగ్గిపోవటం ధరలపై కొంత ప్రభావం పడింది. ఖమ్మం టోకు విపణికి సీజన్‌లో రోజుకు 800-900 క్వింటాళ్ల కూరగాయలు దిగుమతి అవుతుంటాయి. ప్రస్తుతం రోజుకు 400- 500 క్వింటాళ్లు మాత్రమే వస్తున్నాయి. వీటిలో కొన్నింటిని ఏపీ, బెంగళూరు, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి టోకు వ్యాపారులు దిగుమతి చేసుకుంటారు.

దుంప కూరలూ ఎక్కువే..

కిలో ఆలుగడ్డ రూ.40, చామగడ్డ రూ.46, క్యారెట్ రూ.50, బీట్‌రూట్ రూ.36 చొప్పున ధరలు పలుకుతున్నాయి.

ఇవి.. కొద్దిగా పర్వాలేదు..

కిలో బెండ రూ.30, దొండ రూ.24, సొరకాయ రూ.30, వంకాయ రూ.18, దోస రూ.30, క్యాబేజి రూ.26.

చిక్కదు గోరుచిక్కుడు..

15 రోజుల క్రితం గోరుచిక్కుడు కిలో ధరలు రూ.26 నుంచి రూ.30 ఉన్నాయి. ప్రస్తుతం కిలో రూ.58కి పెరగటంతో వినియోగదారులు కొనలేకపోతున్నారు.

ఠారెత్తిస్తున్న భగ్గుమంటున్న పచ్చిమిరప

నెల రోజులుగా పచ్చిమిరప ధరలు భగ్గుమంటున్నాయి. రెండు రోజుల క్రితం కిలో రూ.58 ఉంటే.. ఇప్పుడు మళ్లీ కిలో ధర రూ.70 పలుకుతోంది. అయినా విపణిలో సరకు దొరకటం లేదు. చాలా తక్కువ నిల్వలు ఉంటున్నాయి.

టమాట..

కొద్దినెలల పాటు టమాట ధరలు కిలో రూ.30 నుంచి రూ.40 మధ్య స్థిరంగా ఉండేవి. ఇప్పుడు రైతుబజార్లలోనే కిలో రూ.64 వరకు పలుకుతోంది. బహిరంగ విపణిలో చిరు వ్యాపారులు రూ.75కు విక్రయిస్తున్నారు.

కాకరా.. మజాకా..

వారం క్రితం కిలో రూ.30 నుంచి రూ.35 వరకు ఉన్న కాకరకాయల ధర ఇప్పుడు అమాంతం పెరిగింది. ప్రస్తుతం పొట్టి రకం కిలో ధర రూ.66, పొడవు రకం రూ.70 వరకు పలుకుతోంది.

కొనలేం.. క్యాప్సికం

క్యాప్సికం కిలో ధర రూ.74 వరకు ఉంది. వినియోగదారులు కొనలేని పరిస్థితి నెలకొంది. ఇటీవల వరకు కిలో రూ.35 నుంచి రూ.45 వరకు ఉన్న ధరలు ఒక్కసారిగా పెరిగాయి.

వామ్మో బీర

బీరకాయల ధర కిలో రూ.80 వరకు ఉండటంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. వీటి ధరలు ఇంతగా ఎన్నడూ పెరగలేదని వాపోతున్నారు. పక్షం రోజుల వరకు కిలో రూ.30లోపు ఉన్న ధరలు విపరీతంగా పెరిగాయి. సరకు సైతం తక్కువగా ఉంది.

ఆకుకూరలూ పిరం..

కొద్దిరోజుల వరకు రూ.10కి 2 కట్టల చొప్పున ఆకుకూరలు విక్రయించారు. ప్రస్తుతం రూ.20కి 2 లేదా 3 కట్టలు మాత్రమే ఇస్తున్నారు. కొత్తిమీర కట్ట ధర రూ.70కి చేరింది. గతంలో రోజుకు 60-70 కట్టలు విక్రయించిన వ్యాపారులు ఇప్పుడు 10- 20 మాత్రమే తెస్తున్నారు. ధర ఎక్కువగా ఉండటంతో పాడైపోతాయనే భయంతో తక్కువ మొత్తంలోనే తెచ్చి అమ్ముతున్నారు.

# సీతా రామా ..ఇక వడివడిగా ..!

ఖమ్మం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో లక్షలాది ఎకరాలను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో ఏడేళ్ల క్రితం సీతారామ ప్రాజెక్టుకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2017లో తొలి అడుగు పడినా.. ఇప్పటికీ ప్రాజెక్టు పనుల్లో ఆశించిన పురోగతి కనిపించటం లేదు. తాజాగా లోక్‌సభ ఎన్నికలు ముగియటంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్షేత్రస్థాయిలో పనులను గురువారం పరిశీలించనున్నారు.

రంగంలోకి అమాత్యులు పనులు ప్రారంభించిన రెండేళ్లలోనే పూర్తిచేసి సాగునీరందించాలన్నది సర్కారు లక్ష్యం. ఏడేళ్లు గడుస్తున్నా ప్రాజెక్టు పనులు కొలిక్కి రాలేదు. ఆది నుంచే అడ్డంకులు, అవాంతరాలు ఎదురయ్యాయి. భూసేకరణ ప్రక్రియకే దాదాపు రెండేళ్లు పట్టింది. తర్వాత కొవిడ్ మహమ్మారి విజృంభించటంతో పనులు ముందుకు సాగలేదు. తదనంతరం పనులు గాడినపడ్డట్టు అనిపించినా ఆశించిన పురోగతి కనిపించలేదు. 2023లో శాసనసభ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ సర్కారు కొలువుదీరాక ఈప్రాజెక్టుపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక దృష్టి సారించారు. పలుమార్లు సమీక్షలు జరిపి అధికారులకు దిశానిర్దేశం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడి నిధుల విడుదలకు కృషి చేయటంతో పనులు మళ్లీ గాడినపడ్డాయి. రాష్ట్రంలో సార్వత్రిక సమరం, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ముగియటంతో పాలనపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరిస్తామని సీఎం, మంత్రులు ప్రకటించారు. ఇందులో భాగంగా సీతారామ ప్రాజెక్టు పనులను డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్షేత్రస్థాయిలో గురువారం పరిశీలించనున్నారు. అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. మరోవైపు సీతారామ ప్రాజెక్టులో భాగంగా ఓచోట రిజర్వాయర్ నిర్మించాలని సర్కారు యోచిస్తోంది. 10- 13 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉండాలని భావిస్తోంది. ఇందుకు సంబంధించిన సాధ్యాసాధ్యాలపై అధికారుల నుంచి ప్రతిపాదనలు కోరింది. మంత్రుల తాజా పర్యటనలో రిజర్వాయర్ నిర్మాణంపైనా కీలక నిర్ణయం వెలువడే అవకాశముంది.

ఇదీ ప్రాజెక్టు స్వరూపం ఖమ్మం జిల్లాలో 4 లక్షలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2 లక్షలు, మహబూబాబాద్ జిల్లాలో 1.20 లక్షల ఎకరాల ఆయకట్టుకు గోదావరి జలాలు అందించాలనే ఉద్దేశంతో సీతారామ ఎత్తిపోతల పథకానికి రూపకల్పన జరిగింది. ప్రాజెక్టులో మొత్తం నాలుగు చోట్ల పంప్ హౌస్‌లు నిర్మించారు. ఈ ప్రాజెక్టును 16 ప్యాకేజీలుగా విభజించారు. భద్రాద్రి జిల్లాలోని 1- 8 ప్యాకేజీల్లో 114 కి.మీ. పొడవు ప్రధాన కాల్వ నిర్మాణం దాదాపు పూర్తికావొచ్చింది. సత్తుపల్లి ట్రంకు పనులను 9-12 ప్యాకేజీలుగా విభజించారు. కాల్వ పొడవు 116 కి.మీ. ఉంటుంది. యాతాకులకుంట టన్నెల్, గండుగులపల్లి వద్ద నాలుగో పంప్‌హౌస్ పనులు సాగుతున్నాయి. పాలేరు ట్రంక్ పనులను 13- 16 ప్యాకేజీల కింద చేపట్టారు. 79 కి.మీ. పొడవు కాల్వలు నిర్మించాల్సి ఉంది.

# వైసీపీకి మెసేజ్ పంపేందుకే వినుకొండ హత్య



అమరావతి, జూలై 20: రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో తీవ్ర వైఫల్యం జరిగిందని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వ్యాఖ్యలు చేశారు. శనివారం పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ఎంపీలను ఉద్దేశించి మాట్లాడుతూ... వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తల మీద దారుణంగా దాడులు జరుగుతున్నాయన్నారు. వినుకొండలో జరిగిన హత్యా ఘటన పరాకాష్ట అన్నారు. వీడియో దృశ్యాలు చూస్తే ఈ రాష్ట్రంలో పరిస్థితులు ఎలా జరుగుతున్నాయో తెలుస్తుందన్నారు. ప్రజలందరూ చూస్తుండగా, నడిరోడ్డుమీద కత్తితో జరిగిన దాడి అత్యంత అమానుషమన్నారు.

**వారిని కాపాడుకోవాలి...** ఢిల్లీలో ధర్నా, నిరసన కార్యక్రమానికి సంబంధించి ఒక్కో ఎంపీకి, ఒక్కో బాధ్యత అప్పగించాలని జగన్మోహన్‌రెడ్డి ఆదేశించారు. గత ఎన్నికల్లో మనం 86శాతం సీట్లను గెలిచామన్నారు. వైయస్సార్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు... ఓటు వేయని వారికి కూడా ఇంటింటికీ వెళ్లి పథకాలు ఇచ్చామన్నారు. ప్రజలిచ్చిన వాగ్దానాల అమలు కాకపోవడంపై ఎవ్వరూ ప్రశ్నించకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు.

ఎక్కడ కార్యకర్తలకు నష్టం జరిగినా వెంటనే స్పందించడం, వారిని కాపాడుకోవడం బాధ్యత అని చెప్పుకొచ్చారు. కార్యకర్తలందరి తరపున గట్టిగా నిలబడాలన్నారు. రాష్ట్రంలో వైయస్సార్‌సీపీకి లక్షల మంది కార్యకర్తలు ఉన్నారని... వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. "మన పోరాటం ద్వారా గట్టి ఒత్తిడి తీసుకురావాలి" అని ఎంపీలకు జగన్ మోహన్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.



# రాష్ట్రానికి రావాల్సిన నిధులు, ప్రాజెక్టులపై చర్చించండి

## ఎంపీలతో చంద్రబాబు భేటీ.. చర్చించిన కీలక విషయాలివే..!

అమరావతి: తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ ఈరోజు (శనివారం) భేటీ అయింది. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఉడవల్లిలోని సీఎం చంద్రబాబు నివాసంలో జరిగిన ఈ ఈ భేటీకి ఎంపీలు, మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై చంద్రబాబు చర్చించారు. ఈ నెల 22వ తేదీ నుంచి పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలు, లేవనెత్తాల్సిన అంశాలపై చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. కేంద్రంలోని వివిధ మంత్రిత్వ శాఖల నుంచి తెచ్చుకోవాల్సిన నిధులు, వివిధ కేంద్ర పథకాల ద్వారా రాష్ట్రానికి మరింత ప్రయోజనం పొందేందుకు చేయాల్సిన కృషిపై సీఎం చంద్రబాబు సూచనలు చేశారు. అమరావతి, పోలవరం వంటి ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వ సాయం వంటి అంశాలపై విస్తృత సమన్వయంపై చర్చించారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం కోసం ఒక్కో ఎంపీకి ఇప్పటికే కొన్ని శాఖలు చొప్పున బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే.

నేటి సమావేశంలో మంత్రులను కూడా ఎంపీలకు సీఎం జతచేయనున్నారు. పార్లమెంటు సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై ఎంపీలకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రానికి అత్యంత ప్రాధాన్యతా అంశాలైన అమరావతి, పోలవరం ప్రాజెక్టులకు నిధుల సాధనపై చర్చించారు. జలజీవన్ మిషన్, క్రిషి సించాయీ యోజన కింద రాష్ట్రానికి మెరుగైన సాయంపై మాట్లాడారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్‌లో వివిధ ప్రాజెక్టులకు భూముల కేటాయింపునకు సంబంధించిన పెండింగ్ అంశాల పరిష్కారంపై చర్చించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను మళ్లీ గాడిన పెట్టేందుకు చేపట్టాల్సిన చర్యలు, విభజన హామీల్లో భాగంగా రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన వివిధ సంస్థలకు అవసరమైన పూర్తి సదుపాయాలు కల్పించడం తదితర అంశాలపై చంద్రబాబు కీలక సూచనలు, సలహాలు ఇచ్చారు.

# జగన్ హత్య రాజకీయాలను ప్రోత్సహించారు.. మంత్రుల ఫైర్

గుంటూరు జిల్లా: రాష్ట్రంలో మాజీ సీఎం జగన్‌కు తిరిగే హక్కు లేదని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ విమర్శించారు. వినుకొండలో ఇద్దరు వ్యక్తులు మధ్య సంఘటనను రాజకీయంగా వాడుతున్నారని ఆరోపించారు. మాచర్ల నియోజకవర్గంలో చంద్రయ్య హత్య జరిగినపుడు ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. జగన్ ఢిల్లీలో కాదు గల్లీలో చేసిన అవినీతి బాగోతం అందరికీ తెలుసునని ఆక్షేపించారు. జగన్ హత్య రాజకీయాలను ప్రోత్సహించారని ఆరోపణలు చేశారు. ఏపీని జగన్ ఆధోగతిపాలు చేశారని విమర్శించారు. ఈ రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా జగన్ జిమిక్కులు చేస్తున్నారని పెమ్మసాని చంద్రశేఖర్ ఎద్దేవా చేశారు.

**అసెంబ్లీ సమావేశాలకు రావొద్దని జగన్ డ్రామా: కొల్లు రవీంద్ర –** ఏపీ అసెంబ్లీ సమావేశాలకు మాజీ సీఎం జగన్ రాకుండా ఎగ్గొట్టేందుకు వినుకొండ ఘటనను అసరాగా చేసుకుని శవ రాజకీయాలు చేస్తున్నారని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. ఢిల్లీ వెళ్లి ధర్నా చేస్తే ఏం వస్తుందని అన్నారు. జరిగిన ఘటనపై అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని చెప్పారు. వ్యక్తిగత తగాదాలతో జరిగిన హత్యకు రాజకీయ రంగుపులిమే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. జగన్ మైండ్ ఉండి మాట్లాడుతున్నాడో.. మైండ్ లేకుండా మాట్లాడుతున్నాడో అర్థం కావడం లేదని విమర్శించారు. జగన్ ఓ గజినీలా మారిపోయారని మంత్రి కొల్లు రవీంద్ర ఆక్షేపించారు.



**జగన్ ఢిల్లీ ఎలా వెళ్తున్నారు..?: మంత్రి అనగాని –** ఢిల్లీకి మాజీ సీఎం జగన్ ఏ మొఖం పెట్టుకుని వెళ్తున్నారని మంత్రి అనగాని సత్య ప్రసాద్ ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు జగన్ సవ్యంగా ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి వచ్చేది కాదని చెప్పారు. జగన్ తప్పుడు మాటలు.. పిచ్చి కూతలకు ఎవ్వరూ భయపడరని అన్నారు. రౌడీయిజాన్ని అణిచివేసే పార్టీ టీడీపీనేనని స్పష్టం చేశారు. జగన్ పాలనలో హత్యలు.. ఆత్మహత్యలు జరిగాయని విమర్శించారు. జగన్ హయాంలో టీడీపీ కార్యకర్త చంద్రయ్యను దారుణంగా హత్య చేసిన విషయం మరిచిపోయారా..? అని మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రశ్నించారు.

# తెదేపా సూపర్ -6 పథకాలు విజయవంతం కావాలి



నెల్లూరు కలెక్టరేట్ : నెల్లూరులో రొట్టెల పండుగ కొనసాగుతోంది. నెల్లూరు రూరల్ శాసన సభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి బారాషహీద్ దర్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం చేపట్టిన సూపర్ 6 పథకాలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. పేద, మధ్య తరగతి ప్రజలు సంతోషంగా ఉండాలని కోరుకుంటూ స్వర్ణాల చెరువు వద్ద ఏర్పాటు చేసిన ఆరు భారీ రొట్టెలను పట్టుకున్నారు.

# మసిపూసి మారేడుకాయలా మాపై నిందలా.. జగన్‌పై బీజేపీ నేత ఫైర్



అమరావతి, జూలై 20: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై బీజేపీ నేత భానుప్రకాష్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఢిల్లీలో ధర్నా చేస్తానంటూ జగన్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌పై ఆయన మండిపడ్డారు. "జగన్మోహన్ రెడ్డి ఢిల్లీలో ధర్నా చేస్తాడంట" అంటూ ఎద్దేవా చేశారు. ఐదేళ్లల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ కోరాలన్నారు. వైసీపీ ప్రభుత్వంలో చేసిన దాడులు, దారుణాలపై ధర్నాలో చెప్పాలన్నారు.

**ఆ ఘనత జగన్‌దే...** ఐదేళ్లల్లో సీఎంగా జగన్ ప్రజలు, పత్రికలపై చేసిన దాడి లోకమంతా చూసిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను పూర్తిగా ఆందోళన ప్రదేశ్‌గా మార్చిన ఘనత జగన్‌కే దక్కిందని వ్యాఖ్యలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో శాంతి వాతావరణం కల్పించిందని తెలిపారు. కక్ష సాధింపులు కాదని... అభివృద్ధి ఆంధ్రప్రదేశ్‌వైపు అడుగులు వేస్తుందిని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఏపీలో అరాచకాలు దేశంలోనే చర్చగా మారాయన్నారు. జగన్ ఇప్పుడు మసిపూసి మారేడుకాయ అన్న చందంగా తమ మీద నిందలు వేస్తావా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో శాంతి భద్రతలపై అసెంబ్లీలో శ్వేత పత్రం విడుదల చేస్తామని తెలిపారు. చట్ట వ్యతిరేకంగా వ్యవహరించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని భానుప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు.



# టెకీల పని గంటల పెంపు..?

## కర్ణాటకలో టెకీల పని గంటల పెంపు ప్రతిపాదన.. వ్యతిరేకిస్తున్న ఉద్యోగ సంఘాలు

బెంగళూరు: ఐటీ రంగంలో పనిచేసే ఉద్యోగుల పని గంటలు పెంచే ప్రతిపాదనపై కర్ణాటక ప్రభుత్వం ఆలోచన చేస్తోంది. ఇందుకోసం కర్ణాటక షాప్స్ అండ్ కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్, 1961లో కొన్ని మార్పులు చేయాల్సిఉంటుంది. ఈ ప్రతిపాదనపై ట్రేడ్ యూనియన్ల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈమేరకు కర్ణాటక స్టేట్ ఐటీ/ ఐటీ ఆధారిత సేవలు అందించే ఉద్యోగుల సంఘం (కేఐటీయూ) ప్రతినిధులు కార్మిక శాఖ మంత్రి సంతోష్‌లాడ్‌ను కలిసి తమ వ్యతిరేకతను తెలియజేశారు.ప్రతిపాదనల ప్రకారం ఐటీ/ ఐటీఈఎస్/ బీపీఓ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు రోజులో 12 గంటలకు మించి పని చేసేందుకు కొత్త బిల్లు అనుమతిస్తుంది. రోజులో గరిష్ఠంగా 14 గంటల చొప్పున పని చేయడానికి వీలు కల్పిస్తుంది. ప్రస్తుతం ఓవర్‌టైమ్‌తో కలిపి గరిష్ఠంగా 10 గంటలు మాత్రమే పని చేయించేందుకు అనుమతి ఉంది. అయితే, వరుసగా మూడు నెలల్లో ఉద్యోగి చేత 125 గంటలకు మించి అదనపు గంటలు పని చేయించకూడదన్నది ఇందులోని మరో కీలక అంశం. పని గంటల పెంపునకు సంబంధించిన ప్రతిపాదనలు వచ్చాయని, దీనిపై చర్చలు ఇంకా నడుస్తున్నాయని కార్మిక శాఖ మంత్రి 'ది హిందూ'తో పేర్కొన్నారు. దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. ఈ ప్రతిపాదనను ఉద్యోగ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఉద్యోగి రోజులో గరిష్ఠంగా ఎన్ని గంటలు పని చేయాలనే దానిపై కటాఫ్ అంటూ ఏదీ లేదని కేఐటీయూ ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. 125 గంటల గరిష్ఠ పరిమితి వల్ల కంపెనీలు ఉద్యోగులతో తమకు కావాల్సిన రోజులు/ వారాల్లో నిర్దిష్ట పరిమితికి లోబడి పని చేయించుకునే అవకాశం ఉందని చెప్పారు. ప్రస్తుతం వారంలో 48 గంటలకు మించి పని చేయించకూడదని కార్మిక చట్టాలు చెబుతున్నాయన్నారు. పని గంటల పెంపు వల్ల ఉద్యోగులు మరింత మానసిక, శారీరక ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉందన్న ఆందోళన వ్యక్తంచేశారు. అయితే, విస్తృత స్థాయిలో సమావేశం ఏర్పాటుచేస్తామని కార్మిక శాఖ మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

# సినీ నటి శ్రీరెడ్డిపై కేసు నమోదు.. త్వరలో అరెస్ట్!




కర్నూలు: టాలీవుడ్ సినీ నటి, యూట్యూబర్ శ్రీరెడ్డిపై పోలీసు కేసు నమోదయ్యింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. మంత్రులు నారా లోకేష్, వంగలపూడి అనితలపై శ్రీరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియా వేదికగా ఆమె చేసిన ఈ కామెంట్స్‌ను సీరియస్‌గా తీసుకున్న కర్నూలు టీడీపీ బీసీ సెల్ నాయకుడు రాజు యాదవ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కర్నూలు మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. త్వరలోనే శ్రీరెడ్డిని విచారణకు పిలిచేందుకు.. ఆ తర్వాత అరెస్ట్ చేసేందుకు కూడా పోలీసులు రంగం సిద్ధం చేసుకున్నట్లుగా వార్తలు గుప్పుమంటున్నాయి.

**అరెస్ట్ చేయాల్సిందే..!** టీడీపీ నేతలు, వారి కుటుంబ సభ్యులను ఉద్దేశించి కించపరిచే విధంగా శ్రీరెడ్డి మాట్లాడారని.. ఇది ఏ మాత్రం కరెక్ట్ కాదని.. విషపు ఆలోచనలు ఉన్నవారు మాత్రమే ఇలాంటి పనులు చేస్తారని రాజు యాదవ్ మండిపడ్డారు. ఈమెను ఆదర్శంగా చేసుకుని మిగిలిన వాళ్లు కూడా ఇలా మాట్లాడే అవకాశాలు మెండుగా ఉన్నాయని.. అందుకే శ్రీరెడ్డిని అరెస్ట్ చేసి తగిన బుద్ధి చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా.. ఎన్నికల ముందు ఆమె చేసిన వ్యాఖ్యలపై ఇప్పుడు కేసు నమోదయ్యింది. ఈ కేసు వ్యవహారంపై ఇంతవరకూ శ్రీరెడ్డి మీడియా, సోషల్ మీడియా వేదికగా ఎక్కడా స్పందించలేదు.





# జగన్ వ్యాఖ్యలపై స్ట్రాంగ్ కౌంటర్

అమరావతి, జూలై 20: రాష్ట్ర ప్రభుత్వంపై మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు జనసేన నేత కొణిదల నాగబాబు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. శనివారం నాడు జగన్ వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తూ వీడియో విడుదల చేశారు. జగన్ శవ రాజకీయాలు మానుకో అని హితవుపలికారు. రషీద్ హత్యకు రాజకీయాలతో సంబంధం లేదన్నారు. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవలో అతను హత్య చేయబడ్డాడని తెలిపారు. ఈ హత్యను జనసేన పక్షాన తాము ఖండిస్తున్నామన్నారు. జగన్ పాలనలో ఎన్నో దారుణాలు చేశారని గుర్తుచేశారు. ప్రభుత్వ లోపాలను ప్రశ్నిస్తే కొట్టారని... ప్రతిపక్ష నేతల గొంతెత్తితే కేసులు పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమాయకులైన ప్రాణాలను బలి తీసుకున్నారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలపై పెట్టిన కేసులకు హద్దే లేదన్నారు. పోలీసు వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఐపీఎస్‌లను వైసీపీ నాయకులుగా మార్చి పని చేయించారని వ్యాఖ్యలు చేశారు. "మీ దందాలకు అమాయకులైన అధికారులు బలి అయ్యారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలు నోరెత్తాలంటే భయపడి పోయారన్నారు. "మీరు ఇప్పుడు నీతులు వల్లిస్తున్నారు" అంటూ ఎద్దేవా చేశారు. వ్యక్తుల మధ్య గొడవతో జరిగిన హత్యను రాజకీయంగా వాడుకోవాలని చూస్తున్నారన్నారు. "ప్రజలు మీకు బుద్ధి చెప్పినా... ఇంకా మీ బుద్ధి మార్చుకోవడం లేదు" అంటూ నాగబాబు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

**జగన్ ఏమన్నారంటే..** వినుకొండలో హత్యకు గురైౖ రషీద్ కుటుంబసభ్యులను నిన్న(శుక్రవారం) మాజీ ముఖ్యమంత్రి జగన్ పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన జగన్... రాష్ట్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలపై ఢిల్లీలో 24న వైసీపీ ధర్నా చేస్తుందని ప్రకటించారు. రాష్ట్రంలో లా-అండ్-ఆర్డర్ లేదనడానికి వినుకొండలో రషీద్ హత్యే నిదర్శనమంటూ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసిన చంద్రబాబు పథకాలు ఇవ్వకుండా ప్రజలను మోసం చేస్తున్నారని జగన్ విమర్శించారు.

# ఏజెంట్ చేతిలో మోసపోయిన ఏపీ వాసి.. స్వదేశానికి తీసుకొస్తానంటూ హామీ..




ఏజెంట్ల చేతిలో మోసపోతూ ఎంతో మంది తెలుగువాళ్లు విదేశాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా కువైట్‌లో చిక్కుకున్న ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఓ వ్యక్తిని స్వదేశానికి తీసుకొచ్చేందుకు లోకేష్ తీవ్రంగా కృషి చేశారు. కువైట్‌లోని భారత రాయబారం కార్యాలయంతో మాట్లాడి ఆ యువకుడిని స్వదేశానికి తీసుకొచ్చారు. తాజాగా ఏపీకి చెందిన మరో వ్యక్తి సౌదీ అరేబియా ఏడారిలో చిక్కుకున్నానంటూ ఓ వీడియోను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఏజెంట్ చేతిలో మోసపోయానని.. తన పరిస్థితి బాగోలేదంటూ.. ఎవరైనా సాయం చేయాలంటూ ప్రధేయపడ్డాడు. ఈ వీడియో చూసిన ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే స్పందించారు. ధైర్యంగా ఉండాలని.. వీరేంద్రను స్వదేశానికి తీసుకొచ్చే బాధ్యత తనదంటూ భరోసా ఇచ్చారు. డోంట్‌వర్రీ.. నిన్ను క్షేమంగా ఇంటికి తీసుకొస్తామని లోకేష్ ట్వీట్ చేశారు.

**ఎవరీ వీరేంద్ర..** ఆంధ్రప్రదేశ్‌లోని కోనసీమ జిల్లాకు చెందిన సరేళ్ల వీరేంద్రకుమార్ స్వస్థలం అంబాజీపేట మండలం ఇసుకపూడి. ఉపాధి కోసం ఏజెంట్ మాటలు నమ్మి ఖతర్ వెళ్లాడు. ఖతర్‌లో మంచి ఉద్యోగం ఉందని చెప్పడంతో వీరేంద్రకుమార్ వీసా కోసం ఏజెంట్‌కు రూ.1,70,000 చెల్లించాడు. వీరేంద్రకుమార్ డబ్బులు కట్టడంతో ఖతర్‌కు వీసా ఇప్పించాడు. ఈనెల 10న వీరేంద్ర ఖతర్ చేరుకున్నాడు. అక్కడి నుంచి ఓ వ్యక్తి 11వ తేదీన సౌదీ అరేబియా ఏడారి ప్రాంతంలోకి తీసుకెళ్లి వదిలేశాడు. దీంతో తాను మోసపోయానని వీరేంద్ర గుర్తించాడు. చివరికి తన దగ్గర ఉన్న ఫోన్‌లో వీడియో తీసి తన కుటుంబ సభ్యులకు పంపించాడు. దీనిని మిత్రుల సహాయంతో ఎక్స్‌లో పోస్ట్ చేయడంతో నారా లోకేష్ దీనిని చూశారు. వెంటనే స్పందించిన లోకేష్ వీరేంద్రను స్వదేశానికి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు.

**తన కష్టాలు చెప్పుకుంటూ వీడియో..** తన ఆరోగ్య పరిస్థితి బాగోలేదని.. కనీసం తాగడానికి నీళ్లు లేవంటూ వీరేంద్ర వీడియోలో చెప్పుకొచ్చాడు. ఒంటెలు ఉండే గుడారాల వద్ద తనను వదిలేశారని.. ఇక్కడ ఉండటానికి ఎలాంటి సదుపాయాలు లేవని వీరేంద్ర ఆవేదన వ్యక్తం చేశాడు. తనను ఖతర్ తీసుకెళ్తానని చెప్పిన వ్యక్తి సౌదీలో తన దగ్గర నాలుగు రోజులు ఉంచుకుని.. ఆ తర్వాత ఏడారి ప్రాంతంలో విడిచిపెట్టి వెళ్లిపోయినట్లు వీడియోలో వీరేంద్ర చెప్పుకొచ్చాడు. తనకు రక్తపు వాంతులు అవుతున్నాయని, ముక్కులోంచి రక్తం వస్తుందని.. ఇదే పరిస్థితి కొనసాగితే తాను మరో 10 రోజుల్లో చచ్చిపోయే అవకాశం ఉందని చెప్పాడు. ఎవరైనా తనపై దయతోఇక్కడి నుంచి స్వస్థలానికి చేర్చే ప్రయత్నం చేయాలని వీరేంద్రకుమార్ కోరాడు.

## జెబ్బల గౌనులో బుట్టబొమ్మ సయ్యాట!

ఫ్యాషన్ వరల్డ్ లో ముంబై బ్యూటీ పూజాహెగ్డే ఓ స్పెషలిస్ట్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. అమ్మడి ఎంపికలు అమెలో బ్యూటీని అంతకంతకు హైలైట్ చేస్తుంటాయి. కటౌట్ కి తగ్గట్టు సొగసరి ఎంపిక చేసుకునే దుస్తులే అమ్మడి అందాన్ని రెట్టింపు చేస్తుంటాయి. హైట్..వెయిట్ కి తగ్గట్టు కట్టుబొట్టు ప్రతీ విషయంలో ఎంతో శ్రద్ధ తీసుకుంటుంది. డిజైనర్ దుస్తులైనా...సంప్రదాయ వస్త్రాలైనా బుట్టబొమ్మ ధరించిందంటే ఆ దుస్తులకే వన్నె వచ్చేస్తుంది. తాజాగా పూజాహెగ్డే మరోసారి అందాన్ని రెట్టింపు చేసే జెబ్బల గౌనులోకి దూరిపోయింది. ఇదిగో ఇక్కడిలా జెబ్బల గౌనేసి..కళ్లకు అద్దాలు ధరించి కిలకిలా నవ్వేసింది. ఓ చేతిని వయ్యారంగా చాచి..మరో చేతిలో ఐస్ క్రీమ్ తో ఫోజులిచ్చిందిలా. అమ్మడు ముస్తాబైన విధానం..



అలంకరణ ప్రతీది బుట్టబొమ్మని మరింత అందంగా తీర్చి దిద్దాయి. జెబ్బల గౌను ఎప్పుడేసినా? అమ్మడి కోసమే ఆ డిజైన్ పుట్టిందా? అన్న అందంగా హైలైట్ అవుతుంది. తనలో బ్యూటీని బ్యూటీని ప్రాజెక్ట్ చేయడానికి పర్ఫెక్ట్ ఔట్ ఫిట్ ఇది. ఈసారి సంథింగ్ స్పెషల్ గా చేతిలో ఐస్ క్రీమ్ తో మురిపించడం విశేషం. ప్రస్తుతం ఈ ఫోటో నెట్టింట వైరల్ గా మారింది. పూజా అందానికి నెటి జనులంతా ఫిదా అవుతున్నారు. అమ్మడు క్యూట్ ఫోజుకి కుర్రాళ్లంతా వావ్ అనేస్తున్నారు. ముంబై బ్యూటీనా? మజాకానా? మరి! ఇక పూజా కెరీర సంగతి చూస్తే..టాలీవుడ్ నుంచి ఎంత సాలిడ్ గా వెళ్లిందో? అంతే సాలిడ్ అమ్మడు సౌత్ లో కంబ్యాక్ అవుతోన్న విషయం తెలిసిందే. యువ సామ్రాట్ నాగచైతన్య సరసన ఓ కొత్త సినిమాకి ఇటీవలే సంతకం చేసింది. అతి త్వరలోనే ఆ ప్రాజెక్ట్ పట్టాలెక్కనుంది. అలాగే కోలీవుడ్ లో సూర్య 44వ చిత్రంలోనూ పూజ అవకాశం అందుకుంది. ఇలా వరుసగా రెండు సినిమాల్లో ఛాన్సులు అందుకోవడం అన్నది చాలా ఈజీగానే జరిగింది.

## రాజా సాబ్ బ్యూటీ గ్లామర్ ట్రీట్.. చూస్తే ఫిదానే!

మలయాళీ ముద్దుగుమ్మ మాళవిక మోహనన్.. స్టార్ సినిమాటోగ్రాఫర్ మోహనన్ కుమార్తెగా సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. చేసింది తక్కువ సినిమాలే అయినా.. తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. తన అందం, అభినయంతో స్పెషల్ ఫ్యాన్ బేస్ క్రియేట్ చేసుకుంది. తెలుగులో ఒక్క సినిమా కూడా చేయకుండానే ఇక్కడా మంచి ఫాలోయింగ్ దక్కించుకుంది. త్వరలోనే టాలీవుడ్ డెబ్యూ మూవీతో సందడి చేయనుంది. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ రాజా సాబ్ మూవీలో ఆడిపాడుతోంది. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నట్లు తెలుస్తోంది. అయితే సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్ గా ఉండే మాళవిక.. రెగ్యులర్ గా గ్లామరస్ పిక్స్ పోస్ట్ చేస్తూ కుర్రాళ్ల హృదయాలను గెలుచుకుంటోంది. తన పరువాలు, థైస్ షోతో నెట్టింట సెగలు పుట్టిస్తోంది. తాజాగా మరోసారి సోషల్ మీడియాలో ఒక్కసారిగా తన పిక్స్ తో హీట్



పెంచింది. ఓపెన్ బ్యాక్ తో టైట్ వైట్ కలర్ మోడ్రన్ డ్రెస్ లో అందాలు ఆరబోసింది మాళవిక. స్పెషల్ డిజైన్ తో ఉన్న డ్రెస్ అదిరిపోయింది. ఇక మాళవిక స్కిన్ షో అయితే వేరే లెవల్. మిర్రర్ లో చూస్తూ రకరకాలుగా పోజులిస్తూ కిర్రెక్కిస్తోంది. బ్యాక్ షో చేస్తూ మైండ్ బ్లాక్ చేస్తోంది. నడుము వొంపులతో అందరినీ ఫ్లాట్ అయ్యే స్టిల్స్ ఇచ్చింది. ఓర చూపులతో కుర్రకారును తన బుట్టలో వేసుకుంటోంది. గ్లామర్ షో అంటే ఇలా ఉండాలని చెబుతోంది! ప్రస్తుతం మాళవిక నయా పిక్స్ నెట్టింట తెగ చక్కర్లు కొడుతున్నాయి. లాంగ్ డ్రెస్ లో కూడా కనీకనిపంచని అందాలతో అమ్మడు మాయ చేస్తుందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఆమె లుక్స్ తోపాటు అందానికి దాసోహమయ్యామని రచ్చరచ్చ చేస్తున్నారు. ఒక్కో పోజు వేరే లెవల్ లో ఉందని అంటున్నారు. మాలీవుడ్ బ్యూటీ.. కిర్రాక్ ఉందని చెబుతున్నారు. మొత్తానికి మాళవిక మోహనన్ పిక్స్ ఓ రేంజ్ లో వైరల్ అవుతున్నాయి. సుమారు పదేళ్ల క్రితం మాలీవుడ్ మూవీ పట్టం పోలేతో హీరోయిన్ గా మారింది మాళవిక మోహనన్. రజనీకాంత్ పేట మూవీలో యాక్ట్ చేసి అన్ని ఇండస్ట్రీలు కవర్ చేసింది. ఆ తర్వాత విజయ్ తో మాస్టర్, ధనుష్ తో మారన్ చిత్రాలు చేసింది. మలయాళం, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో సినిమాలు చేసిన ఈ అమ్మడు.. ఇప్పుడు టాలీవుడ్ లో తన లుక్ ను పరీక్షించుకునేందుకు సిద్ధమవుతోంది. మరి రాజా సాబ్ తో ఈ బ్యూటీ ఎలాంటి హిట్ అందుకుంటుందో వేచి చూడాలి.





## తమన్నా కావాలా వైబ్స్ మళ్లీ మళ్లీ



రాజ్‌కుమార్ రావ్ - శ్రద్ధా కపూర్ నటించిన స్త్రీ 2 ట్రైలర్ ఎట్టకేలకు విడుదలైంది. హారర్ కామెడీ జానర్ లో బ్లాక్ బస్టర్ మూవీ స్త్రీకి సీక్వెల్ ఇది. పార్ట్ 2 రాక కోసం ప్రతి ఒక్కరూ చాలా ఉత్సాహంగా వేచి చూస్తున్నారు. ట్రైలర్ లో మొండెం లేని భూతం రాజ్‌కుమార్ రావుని ఎందుకు వెంబడించింది? అన్నది తెరపైనే చూడాలి. 'భూతప్రేత స్నేహితురాలు'గా శ్రద్ధ కపూర్ ఈ చిత్రంలో నటించింది. ఆరంభం ఎంత సరదాగా ఉంటుందో జీవితంలో టెర్రర్ అదే రేంజులో ప్రవేశిస్తుంది. భూతంతో స్నేహం ఏ దిశగా దారి తీసింది? అన్నది తెలియాలంటే ఆగస్టు 15 వరకూ ఆగాల్సిందే. స్త్రీ 2 ట్రైలర్‌లో శ్రద్ధా కపూర్ అందచందాలు మాత్రమే కాదు.. తమన్నా భాటియా వేడెక్కించే హొయలు కూడా ప్రత్యేకంగా ఆకర్షించాయి. ట్రయిలర్ చివరలో తమన్నా పెప్పీ నంబర్ లో ఎంతో రొమాంటిక్ గా కనిపించింది. ఆకుపచ్చ రంగు బ్రాలెట్ - స్కర్ట్‌తో ఆకర్షణీయంగా కనిపించింది. తమన్నా యూనిక్ మూవ్స్‌తో స్క్రీన్ పై మంటలు పెట్టడం ఖాయమని భరోసానిచ్చింది. మిల్కీ బ్యూటీ మూవ్స్.. తన గత బ్లాక్‌బస్టర్ పాట 'కావాలా'ని గుర్తుకు తెస్తున్నాయి. ట్రైలర్‌లో తమన్నా సర్‌ప్రైజ్ ట్విస్ట్ ఉత్కంఠ కలిగించింది. మిల్కీ ఐటెమ్ నంబర్ యూత్ కి స్పెషల్ ట్రీట్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. స్త్రీ 2018లో విడుదలైంది. ఈ సినిమా విమర్శకుల ప్రశంసలు అందుకుంది. బాక్సాఫీస్ వద్ద వాణిజ్యపరంగా విజయం సాధించింది. మిలేగీ మిలేగీ .. ఆవో కభీ హవేలీ పే ర్యాగింగ్ చార్ట్‌బస్టర్‌లుగా మారడంతో ఈ చిత్రం సంగీతం కూడా చాలా మంది దృష్టిని ఆకర్షించింది. ఇందులో ప్రత్యేక పాట కమారియాలో నోరా ఫతేహి డ్యాన్స్ ప్రదర్శనను ప్రేక్షకులు ఎప్పటికీ ప్రేమగా గుర్తుంచుకుంటారు. ఇప్పుడు స్త్రీ 2 చిత్రానికి అమర్ కౌశిక్ దర్శకత్వం వహిస్తున్నారు. దినేష్ విజన్ మాడాక్ ఫిల్మ్స్ - జియో స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. స్త్రీ, రూహి, భేదియా చిత్రాల శ్రేణిలో అదే నిర్మాత రూపొందించిన హారర్-కామెడీ విశ్వంలో ఒక భాగం. స్త్రీ 2 చిత్రం 15 ఆగస్ట్ 2024న థియేటర్లలో విడుదల కానుంది.

## ప్రభాస్‌కు ఇలాంటివి చాలా రొటీన్: అమితాబ్




రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన సైన్స్ ఫిక్షన్ మూవీ 'కల్కి 2898 ఏడీ'. ఇందులో అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకునే వంటి స్టార్ యాక్టర్స్ భాగమయ్యారు. బాక్సాఫీస్ వద్ద ఎపిక్ బ్లాక్ బస్టర్ గా నిలిచిన ఈ చిత్రం.. ?1050 కోట్లకు పైగా వసూళ్లతో దూసుకుపోతోంది. సినిమా సక్సెస్ ను ఎంజాయ్ చేస్తున్న చిత్ర బృందం.. ఒక్కరొక్కరుగా తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తూ వీడియోలు రిలీజ్ చేస్తున్నారు. ఇప్పుడు తాజాగా అమితాబ్ వీడియో రూపంలో అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. 'కల్కి' సినిమా విజయంలో భాగమైన వారందరికీ ధన్యవాదాలు చెప్పిన అమితాబ్ బచ్చన్.. 1000 కోట్ల కలెక్షన్స్ కంటే ప్రేక్షకుల ప్రశంసలు, ప్రేమ ఎంతో విలువైనవని అన్నారు. ఇదంతా దర్శకుడు నాగ్ అశ్విన్ విజన్, నిర్మాతలు అశ్వినీ దత్, ప్రియాంక దత్, స్వప్న దత్ ల నమ్మకం వల్లనే సాధ్యమైందని చెబుతూనే.. సినిమా సక్సెస్ లో ప్రతి ఒక్కరికీ భాగం ఉందని చెప్పారు. తన కోస్టార్స్ కమల్ హాసన్, ప్రభాస్, దీపికా పదుకునేల నటనను మెచ్చుకున్నారు. ఈ సినిమా కోసం ఎన్నో ఏళ్లుగా కష్టపడిన నటీనటులు, సాంకేతికత నిపుణుల కృషిని అభినందించారు. ప్రభాస్ కు 1000 కోట్ల వసూళ్లు కొత్తమీ కాదని, కానీ తనకు మాత్రం ఇలాంటి గొప్ప చిత్రంలో భాగమైనందుకు సంతోషంగా ఉందన్నారు అమితాబ్. "ప్రభాస్ కు ఇలాంటి సక్సెస్ లు రొటీన్ గా మారిపోయాయి. ఇటీవల కాలంలో ఆయన నటించిన చాలా సినిమాలు వెయ్యి కోట్ల క్లబ్‌లో చేరాయి. నాకు మాత్రం కల్కి లాంటి అతి పెద్ద కాన్సెప్ట్ లో భాగమైనందుకు చాలా ఆనందంగా గౌరవంగా ఉంది" అని బిగ్ బీ తెలిపారు. 'కల్కి' పార్ట్-2 కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్టు చెప్పారు. "నేను ఈ చిత్రాన్ని ఎంతగా ఎంజాయ్ చేశానో మాటల్లో చెప్పలేను. ఆల్రెడీ నాలుగుసార్లు సినిమా చూశాను. కొందరు గెస్టులతో కలిసి ఐమాక్స్ లో చూశాను. ప్రతిసారి ఏదో ఒక కొత్త విషయం తెలుసుకుంటూనే ఉన్నాను. నా వరకూ ఇది ఒక యాక్టర్ జాబ్ అని నేను అనుకోవడం లేదు. నాకు ఇది ఒక గ్రేట్ ఎడ్యుకేషన్. మన కల్చర్, ఇండియన్ మైథాలజీని డైరెక్టర్ నాగి ఎంతో అద్భుతంగా ఒక సినిమాగా తెర మీద ఆవిష్కరించారు" అని అమితాబ్ చెప్పుకొచ్చారు. ఇటీవల ప్రభాస్, కమల్ హాసన్ సైతం 'కల్కి 2898 AD' విజయంపై ఆనందాన్ని వ్యక్తం చేశారు. సినిమాకు ఎన్ని కోట్లు వసూళ్లు వచ్చాయనేది ముఖ్యం కాదని, అదిచ్చిన సంతృప్తి చాలా ముఖ్యమని కమల్ అన్నారు. ఇప్పుడు అమితాబ్ బచ్చన్ ఈ సినిమా సక్సెస్ గురించి ప్రభాస్ కు ఇలాంటి విజయాలు రొటీన్ గా మారిపోయాయి అంటూ రెబల్ స్టార్ బాక్సాఫీస్ స్టామినా గురించి చెప్పకనే చెప్పారు. 'కల్కి 2898 AD' సినిమాలో బౌంటీ హంటర్ భైరవగా, కర్ణుడిగా రెండు పాత్రల్లో కనిపించారు ప్రభాస్. అశ్వత్థామగా అమితాబ్ బచ్చన్, సుప్రీం యాస్కిన్‌గా కమల్ హాసన్ కీలక పాత్రలు పోషించారు. దీపికా పదుకునే, దిశా పటానీ కథానాయికలుగా నటించారు. అర్జునుడుగా విజయ్ దేవరకొండ కనిపించగా.. దుల్కర్ సల్మాన్, మృణాల్ ఠాకూర్, మాళవిక నాయర్, ఎస్.ఎస్. రాజమౌళి, రామ్ గోపాల్ వర్మ అతిథి పాత్రల్లో మెరిశారు.

## పూనమ్ స్టన్నింగ్ లుక్స్.. మైండ్ బ్లాకే

పూనమ్ బజ్వా.. ఈ బ్యూటీ గుర్తుందా? మొదటి సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చింది ఈ బ్యూటీ. ఎవరైనా మొదటి సినిమాతోనే ఎంట్రీ ఇస్తారు కదా అని అనుకోవద్దు. ఆమె యాక్ట్ చేసిన ఫస్ట్ మూవీ పేరే మొదటి సినిమా. సుమారు 19 ఏళ్ల క్రితం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆ సినిమాలో క్యూట్ గా కనిపిస్తూ అందరినీ ఆకట్టుకుంది. అందం, అభినయంతో అలరించింది. కుర్రాళ్ల మనసులు దోచేసింది. ఆ తర్వాత పలు సినిమాల్లో నటించింది. మోడల్ గా మంచి పేరు సంపాదించుకున్న పూనమ్.. మొదటి సినిమా తర్వాత కింగ్ నాగార్జున బాస్ తో పాటు ప్రేమంటే ఇంతే, వేడుక, పరుగు సినిమాల్లో యాక్ట్ చేసి మెప్పించింది. కానీ సరైన హిట్ అందుకోలేకపోయింది. దీంతో వేరే భాషల్లో పలు సినిమాలు చేసింది అమ్మడు. టాలీవుడ్ కన్నా కోలీవుడ్ లోనే ప్రత్యేక గుర్తింపు



దక్కించుకుంది. స్టార్టింగ్ లో స్కోప్ ఉన్న రోల్స్ అందుకున్నా.. ఆ తర్వాత చిన్న చిన్న పాత్రలకు పరిమితమైంది. చివరగా తెలుగులో ఎన్టీఆర్ కథానాయకుడు మూవీలో యాక్ట్ చేసింది. ఇప్పుడు రీఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. పలు తమిళ, మలయాళ చిత్రాల్లో కూడా నటిస్తోంది. కెరీర్ సంగతి ఎలా ఉన్నా.. సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్ గా ఉంటోంది పూనమ్. ఓ రేంజ్ లో సందడి చేస్తుంటోంది. రోజురోజుకు ఫాలోవర్స్ ను పెంచుకుంటోంది. పర్సనల్ కమ్ ప్రొఫెషనల్ విషయాలను షేర్ చేసుకుంటూ నెటిజన్లతో టచ్ లో ఉంటోంది. ఎప్పటికప్పుడు గ్లామరస్ పిక్స్ ను పోస్ట్ చేస్తూ.. కుర్రాళ్లకు నిద్ర లేకుండా చేస్తోంది. పొట్టి పొట్టి డ్రెస్సులు, మోడ్రన్ ఔట్ ఫిట్స్ లో అందాలు ఆరబోస్తుంటోంది. అదిరిపోయే పోజులు ఇస్తూ మైమరపిస్తుంటోంది. తన బ్యూటినెస్ తో ఫిదా చేస్తుంటోంది. ఇటీవల శారీతో సర్ప్రైజ్ ఇచ్చిన అమ్మడు.. ఇప్పుడు మరోసారి బ్లాక్ కలర్ డ్రెస్ లో స్కిన్ షోతో అదరగొట్టేసింది. కుర్చీలో కూర్చుని స్టిల్స్ ఇస్తూ మైండ్ బ్లాక్ చేస్తోంది. ఎద అందాలతో నెటిజన్లను కవ్విస్తోంది. హెయిర్ లీవ్ చేసుకుని ఓరగా చూస్తూ అందరినీ ఫ్లాట్ చేస్తోంది పూనమ్. థైస్ షోతో కుర్రకారును ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ప్రస్తుతం పూనమ్ కొత్త పిక్స్.. సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. అమ్మడి అందానికి దాసోహమయ్యామని నెటిజన్లు చెబుతున్నారు. గ్లామర్ కు కేరాఫ్ అడ్రస్ పూనమ్ అంటూ కామెంట్స్ పెడుతూ రచ్చ రచ్చ చేస్తున్నారు. లైకుల వర్షం కురిపిస్తూ కామెంట్స్ సెక్షన్ నింపేస్తున్నారు. ఏదైనా పూనమ్ ఈజ్ వెరీ బ్యూటిఫుల్!

## శారీలో ఆషిక మాయ

కన్నడ బ్యూటీ ఆషిక రంగనాథ్ హీరో నందమూరి కళ్యాణ్ రామ్ అమిగోస్ సినిమాతో టాలీవుడ్ కు పరిచయమైన విషయం తెలిసిందే. ఫస్ట్ మూవీతోనే తన అందం, అభినయంతో మెప్పించింది. ముఖ్యంగా ఆ సినిమాలో ఎన్నో రాత్రులు సాంగ్ లో తన డ్యాన్స్ అండ్ గ్లామర్ షోతో అలరించింది ఆషిక. అమ్మడు అందానికి యూత్ బాగా కనెక్ట్ అయ్యారు. బాక్సాఫీస్ వద్ద ఆ మూవీ ఆకట్టుకోలేకపోయినా.. ఆషికకు మాత్రం ఫ్యాన్ ఫాలోయింగ్ బాగా పెరిగింది. ఆ తర్వాత నాగార్జున నా సామిరంగా చిత్రంతో ఈ ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు వచ్చింది ఆషిక. ఈ సినిమాలో వరలక్ష్మి రోల్ లో కనిపించింది. నాగార్జున సరసన తన యాక్టింగ్ తో అదరగొట్టేసింది. టాలీవుడ్ లో మరింత క్రేజ్ సంపాదించుకుంది. అభిమానులను కూడా పెంచుకుంది. ఇప్పుడు తెలుగు, కన్నడ ఇండస్ట్రీల్లో వరుస అవకాశాలు అందుకొని దూసుకుపోతోంది. చేతి నిండా సినిమాలతో ఉన్న ఆషిక.. షూటింగ్స్ తో బిజీ బిజీగా గడుపుతోంది. అయితే సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్ గా ఉంటుంది ఆషిక రంగనాథ్. ఎప్పటికప్పుడు కొత్త ఫోటోలు పోస్ట్ చేస్తూ తన ఫాలోవర్స్ తో పలకరిస్తుంటుంది. గ్లామరస్ ఫోటోలతో సందడి



చేస్తుంటుంది. మితిమీరిన గ్లామర్ షో లేకుండా క్యూట్ గా ఉండే పిక్స్ ను ఎక్కువగా షేర్ చేస్తుంటుంది. శారీలతో పాటు మోడ్రన్ డ్రెస్సులో పోజులు ఇస్తూ కుర్రాళ్ల మతులు పోగొడుతుంది. తాజాగా ఆషిక రంగనాథ్ మరోసారి ప్లెయిన్ శారీలో మెరిసింది. స్లీవ్ లెస్ బ్లౌజ్, డబుల్ షేడ్ కలర్ శారీలో దిగిన పిక్స్ ను షేర్ చేసింది ఆషిక. వయ్యారంగా అందాలు ఆరబోసింది. సోఫాలో కూర్చుని పోజులిస్తూ ఫిదా చేసింది. ఓ ఫోటోలో ఎద అందాలతో కవ్వించింది. మరో పిక్ లో నడుమును ఇన్ డైరెక్ట్ గా చూపిస్తూ మాయ చేసింది. మొత్తానికి ఆషిక కొత్త పిక్స్ వేరే లెవల్ లో ఉన్నాయని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. సింపుల్ మేకప్, సూపర్ ఫేస్ టోన్ తో ఆషిక సింప్లీ సూపర్బ్ గా ఉన్నారని చెబుతున్నారు. ఇక ఆషిక అప్ కమింగ్ మూవీస్ విషయానికొస్తే.. ఈ బ్యూటీ ఇటీవల మెగాస్టార్ విశ్వంభర సినిమాలో నటించే ఛాన్స్ కొట్టేసింది. ఈ సినిమాలో అనేక మంది హీరోయిన్లు నటిస్తుండగా.. ఆషిక కూడా కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు సిద్ధార్థ్ హీరోగా చేస్తున్న మిస్ యూ మూవీలో అవకాశం దక్కించుకుంది. ఆమెనే ఈ విషయాన్ని తెలిపింది. మరి ఈ రెండు సినిమాలతో ఆషిక ఎలాంటి హిట్లు అందుకుంటుందో వేచి చూడాలి.



## పూజా ఖేడ్కర్ వివాదం వేళ..

# UPSC చైర్మన్ రాజీనామా..!

దిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్ మనోజ్ సోనీ తన పదవికి రాజీనామా చేసినట్లు సమాచారం. వ్యక్తిగత కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారిక వర్గాలు శనివారం వెల్లడించాయి. గతేడాది ఏప్రిల్ నెలలోనే బాధ్యతలు చేపట్టిన ఆయన.. ఇంకా ఐదేళ్ల పదవీకాలం ఉండగానే అనూహ్యంగా రాజీనామా చేయడం గమనార్హం. ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేడ్కర్ వివాదం వేళ ఈ పరిణామాలు చోటుచేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, ఈ వివాదంతో మనోజ్ సోనీ రాజీనామాకు ఎటువంటి సంబంధం లేదని అధికారిక వర్గాలు వెల్లడించాయి. దాదాపు పదిహేను రోజుల క్రితమే ఆయన తన రాజీనామాను రాష్ట్రపతికి సమర్పించినట్లు పేర్కొన్నాయి. అయితే, దీన్ని ఇంకా ఆమోదించలేదని సదరు వర్గాలు తెలిపాయి. 2017లో యూపీఎస్సీ కమిషన్‌లో సభ్యుడిగా చేరి గతేడాది మే నెలలో ఛైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేశారు.

**పూజా ఖేడ్కర్‌పై ఫోర్జరీ కేసు :** 2029 మే 15 వరకు ఆయన పదవీకాలం ఉంది. అయితే, ఛైర్మన్ పదవి చేపట్టడానికి ఆయన ముందునుంచి సుముఖంగా లేరని సమాచారం. తనను ఈ బాధ్యతల నుంచి రిలీవ్ చేయాలని గతంలోనే ఓసారి అభ్యర్థించినట్లు అధికారిక వర్గాలు పేర్కొన్నాయి. ఇకపై, ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణించాలని సోనీ కోరుకుంటున్నట్లు తెలిపాయి. యూపీఎస్సీ ఛైర్మన్ పదవికి ముందు ఆయన గుజరాత్‌లోని డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో వరుసగా రెండుసార్లు వీసీగా సేవలందించారు. అఖిలభారత సర్వీసులైన ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్, తదితర ఉద్యోగులను ఎంపిక చేసేందుకు యూపీఎస్సీ ఏటా సివిల్స్ సర్వీసెస్ పరీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ పరీక్షతోనే ఐఏఎస్‌కు ఎంపికైన ప్రొబేషనరీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేడ్కర్ ఇటీవల అధికార దుర్వినియోగం, అవకతవకలకు పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలు తీవ్ర దుమారం రేపాయి. ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేపట్టిన యూపీఎస్సీ ఆమెకు శుక్రవారం షోకాజ్ నోటీసు జారీ చేసింది.

# హైదరాబాద్‌కు ఎవరు వచ్చినా అక్కున చేర్చుకుంటున్నాం..: రేవంత్

హైదరాబాద్: గోపన్‌పల్లి ఫ్లైఓవర్‌ను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. జెండా ఊపి ఫ్లైఓవర్‌పైకి ఉమెన్ బైకర్‌ను అనుమతించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే గాంధీ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం సీఎం మాట్లాడారు. “గోపన్‌పల్లి ఫ్లైఓవర్ ద్వారా శేరిలింగంపల్లి అభివృద్ధి చెందుతుంది. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత ప్రభుత్వానిది. తెలంగాణకు 65 శాతం ఆదాయం జంట నగరాల నుంచే వస్తోంది. హైదరాబాద్‌కు ఎవరు వచ్చినా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం. దేశం నలుమూలల నుంచి ఎవరు వచ్చినా అక్కున చేర్చుకుంటున్నాం. హైదరాబాద్ అభివృద్ధికి హైడ్రా వ్యవస్థను తీసుకువస్తున్నాం. మూసీని అభివృద్ధి చేసే బాధ్యత నాది. ఐదేళ్లలో 1.50 లక్షల కోట్లతో మూసీని అభివృద్ధి చేస్తాం. గోపన్‌పల్లిలో ఎకరం



రూ.100 కోట్లు పలుకుతోంది. ఇక్కడికి వచ్చిన ఐటీ, ఫార్మా సంస్థల వల్ల భూమి ధర పెరిగింది” అని సీఎం తెలిపారు.

# నిరుద్యోగ భృతి ఇస్తామని కాంగ్రెస్ మోసం చేసింది: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

%హైదరాబాద్: నిరుద్యోగ భృతి ఇస్తామని కాంగ్రెస్ మోసం చేసిందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో భాజపా యువ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన నిరుద్యోగ మహా ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. రేవంత్‌రెడ్డి జాబ్ క్యాలెండర్ విషయమే మరిచిపోయారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలన్నీ విస్మరించారన్నారు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేకతను కూడగట్టుకుంటోందని.. ఆ పార్టీకి ప్రజలందరూ స్వస్తి చెబుతారన్నారు. “కాంగ్రెస్ నాయకులు ఎవరికి దొరికినంత వారు దోచుకుంటున్నారు. రాష్ట్రంలో విస్తారంగా అవినీతి కొనసాగుతోంది. అధికారాన్ని దుర్వినియోగం చేయడంలో మాత్రమే రాష్ట్రంలో మార్పు వచ్చింది. హామీలన్నీ వంద రోజుల్లో ఎందుకు పూర్తి చేయలేదో చెప్పాలి. గతంలో ప్రజల తీర్పును కాలరాసి కేసీఆర్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను భారాసలో చేర్చుకున్నారు. రాష్ట్రంలో కేవలం జెండా మాత్రమే మారింది. ప్రజావాణి వినిపించడంలో భాజపా కృషి చేస్తుంది. గ్రూప్ 1 మెయిన్స్‌కు 1:50 కాకుండా 1:100 నిష్పత్తిలో ఎంపిక చేయాలి.



రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు గ్రూప్ 2లో 783 పోస్టులను 2000కు పెంచాలి. 1365 గ్రూప్ 3 పోస్టులను 3000కు పెంచాలి. హామీ ఇచ్చినట్లుగా 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వెంటనే చేపట్టాలి. మెగా డీఎస్సీలో భాగంగా 25 వేల ఉద్యోగాలను భర్తీ చేయాలి. నిరుద్యోగులకు వెంటనే రూ.4 వేల భృతిని విడుదల చేయాలి” అని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు.



# మా పార్టీ నేతలను భయపెట్టి కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారు: కేటీఆర్

హైదరాబాద్: భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు గవర్నర్ రాధాకృష్ణన్‌ను కలిశారు. పార్టీ ఫిరాయింపులు, నిరుద్యోగులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చని అంశంపై ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. “తెలంగాణ రాష్ట్రంలో రాజ్యాంగంపై జరుగుతున్న దాడి, ఇతర అంశాలను గవర్నర్ దృష్టికి తీసుకెళ్లాం. నిరుద్యోగ యువత, విద్యార్థులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా తుంగలో తొక్కుతోందో ఆయనకు వివరించాం. హామీలు అమలు చేయాలన్న విద్యార్థుల అరెస్టులు, అక్రమ కేసులతో భయానక వాతావరణం సృష్టిస్తున్నారు. గవర్నర్ చాలా సీరియస్‌గా ఈ అంశాలపై స్పందించారు. హోంశాఖ కార్యదర్శిని పిలిచి వివరాలు అడుగుతానని చెప్పారు. మా పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను భయపెట్టి కాంగ్రెస్‌లో చేర్చుకున్న సంగతి గురించి గవర్నర్‌కు తెలిపాం. దీనిపై న్యాయపోరాటం చేస్తున్నామని.. స్పీకర్‌కు కూడా ఫిర్యాదు చేశామని ఆయనకు వివరించాం. ప్రొటోకాల్ ఉల్లంఘనలను కూడా గవర్నర్‌కు వివరించాం” అని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు భారాస అండగా ఉంటుందని.. వారికి కాంగ్రెస్ ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చే వరకూ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

# భారీ వర్షాలకు కూలిన భవంతి.. ఇద్దరి మృతి

ముంబయి: గత కొద్ది రోజులుగా ముంబయిలో కురుస్తున్న భారీ వర్షాలతో అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా శనివారం ఓ భవనం కూలిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. గ్రాంట్ రోడ్ రైల్వేస్టేషన్ సమీపంలో ఉదయం 10.30గంటలకు భారీ వర్షాల కారణంగా శనివారం ఓ భవనంలోని ఒక భాగం కూలింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. భవనంలోని ఒక భాగం పూర్తిగా కూలిపోగా, మరికొంత భాగం ప్రమాదకరంగా వేలాడుతూ ఉంది. కాగా అగ్నిమాపక సిబ్బంది ఇప్పటి వరకు 13 మందిని రక్షించారు. భవనంలోని నివాసితులు శిథిలాల కింద చిక్కుకొని ఉంటారని, వారిని బయటకు తీయడానికి సహాయక చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు పేర్కొన్నారు.







# కమ్మ అంటేనే.. అమ్మలాంటి ఆప్యాయత

హైదరాబాద్: కమ్మ అంటేనే కష్టపడే గుణం ఉన్నవారు.. అమ్మలాంటి ఆప్యాయత కలిగినవారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కమ్మవారు నేలను నమ్ముకుని కష్టపడి పనిచేస్తారని అన్నారు. ఎక్కడ సారవంతమైన నేల ఉంటే అక్కడ కమ్మవారు కనిపిస్తారని చెప్పారు. కష్టపడటం పదిమందికి సాయం చేయడం కమ్మవారి లక్షణమన్నారు. కమ్మ గ్లోబల్ సమ్మిట్‌ను ఈరోజు(శనివారం) ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. రెండు రోజుల పాటు ఈ సమ్మిట్ జరగనుంది. ఈసందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి కమ్మ సామాజికవర్గం తనను ఎంతగానో అభిమానిస్తుందని తెలిపారు. ఎన్టీఆర్ లైబ్రరీలో చదువుకున్న చదువు, తమను ఉన్నత స్థానంలో నిలబెట్టిందని గుర్తుచేశారు. నాయకత్వానికి దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు ఒక బ్రాండ్ క్రియేట్ చేశారని వివరించారు. ఎన్టీఆర్ రాజకీయంగా ఎంతోమందికి అవకాశాలు ఇచ్చారని ఉద్ఘాటించారు. దేశంలో ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంకీర్ణ రాజకీయాల వల్లే ఈరోజు చాలా మందికి రాజకీయ అవకాశాలు వచ్చాయని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా మార్చేందుకు కమ్మవారు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కమ్మవారిలో ఉన్న నైపుణ్యాలను ప్రోత్సహించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు. తమకు భేషజాలు లేవని.. తాము కులాన్ని అభిమానిస్తామని.. ఇతర కులాలను గౌరవిస్తామని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఎవరిపై వివక్ష ఉండదని.. అది తమ ప్రభుత్వ విధానం కాదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలపడం ఒక హక్కు అని చెప్పారు. నిరసన తెలపకుండా నియంత్రించాలనుకుంటే.. ఫలితాలు ఎలా ఉంటాయో చూశారని గుర్తుచేశారు. జాతీయ స్థాయిలో తెలుగువారు లేని లోటు కనిపిస్తోందని గుర్తుచేశారు. కుల, మతాలకు అతీతంగా జాతీయ స్థాయిలో రాణించే తెలుగువారిని ప్రోత్సహించాలని చెప్పారు. వివాదంలో ఉన్న 5ఎకరాల కమ్మ సంఘం భూ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. భూ సమస్యను పరిష్కరించడంతో పాటు సంఘం భవన నిర్మాణానికి నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. పదిమందికి సాయం చేసే కమ్మవారు సహజ గుణాన్ని వీడొద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు.

# జాబ్ క్యాలెండర్ ప్రకటించాలి.. సీఎం రేవంత్‌పై ఈటల ప్రశ్నల వర్షం

హైదరాబాద్ (ఇందిరాపార్క్): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీలను అమలు చేయడం లేదని, కేసీఆర్ హయాంలో కంటే.. రేవంత్ ప్రభుత్వంలోనే పోలీసులు రెచ్చిపోతున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు మాత్రమే ఓటర్లు కాదు.. ప్రజలే మళ్లీ ఓట్లు వేయాలని రేవంత్ గుర్తుంచుకోవాలని అన్నారు. నిరుద్యోగుల సమస్యలపై ఈరోజు (శనివారం) బీజేవైఎం మహాధర్నా చేపట్టింది. ఈ మహాధర్నాలో ఈటల రాజేందర్ పాల్గొని సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

సీఎం రేవంత్ రెడ్డి ఐదేళ్ల తర్వాత ప్రజల దగ్గరకు రావాలని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. రేవంత్‌కు వందేళ్ల కోసం ప్రజలు అధికారం ఇవ్వలేదని స్పష్టం చేశారు. భేషజాలకు పోకుండా జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ ఇచ్చిన హామీలనే నిరుద్యోగులు అడుగుతున్నారని గుర్తుచేశారు. అమలు చేసే దమ్ముంటేనే ఎన్నికల్లో హామీలు ఇవ్వాలని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలే అంతిమ నిర్ణేతలని రేవంత్ రెడ్డి



గుర్తుంచుకోవాలని అన్నారు. గ్రూప్ – వన్‌లో 1:100 ప్రకటించాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ఇంట్లో ఇబ్బంది లేకపోవచ్చు కానీ నిరుద్యోగులది ఇల్లు గడవని పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాళ్ల కిందకి నీళ్లు వస్తే.. రేవంత్ రెడ్డికి తెలుస్తుందని చెప్పారు.

రేవంత్ చేసే మంచి, చెడు ఏంటో నిరుద్యోగులు లెక్క కడుతున్నారని ఈటల రాజేందర్ ధ్వజమెత్తారు.



# తెలంగాణలో పాఠశాలల వేళల్లో మార్పు.. విద్యాశాఖ ఉత్తర్వులు

హైదరాబాద్: తెలంగాణలో పాఠశాలల వేళలను మారుస్తూ విద్యాశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రాథమిక పాఠశాలల సమయాలకు అనుగుణంగా ఉన్నత పాఠశాలల సమయాల్లో మార్పు చేస్తున్నట్టు ప్రకటించింది.

ఉన్నత పాఠశాల సమయాలను ఉదయం 9.30 నుంచి 9గంటలకు మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సాయంత్రం 4.45కి బదులుగా 4.15 గంటలకు పని వేళలు ముగుస్తాయని తెలిపింది. హైదరాబాద్, సికింద్రాబాద్‌లలో ట్రాఫిక్ సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం అమలులోఉ న్న పని వేళలు కొనసాగుతాయని పేర్కొంది. జంట నగరాల్లో ఉదయం 8.45 నుంచి సాయంత్రం 4గంటల వరకు కొనసాగనున్నాయి. ఈమేరకు చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశించారు.

# హైదరాబాద్‌లో రూ.7కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత.. నలుగురి అరెస్టు

హైదరాబాద్: రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ తీసుకొచ్చి విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. నగరంలోని రాజస్థాన్‌కు చెందిన వ్యక్తులు, వ్యాపారవేత్తలే లక్ష్యంగా విక్రయాలు సాగిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఓటీ శంషాబాద్, మాదాపూర్ పోలీసులు సంయుక్తంగా సోదాలు నిర్వహించారు. నలుగురు నిందితులను అరెస్టు చేసి.. వారి నుంచి 1,250 గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

దీని విలువ సుమారు రూ.7 కోట్లు ఉంటుందని తెలిపారు. నిందితులు నలుగురూ రాజస్థాన్‌కు చెందిన వారేనని సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి మీడియాకు వెల్లడించారు. హెరాయిన్‌ను చిన్న చిన్న ప్యాకెట్లలో పెట్టి.. బస్సుల్లో తీసుకొస్తున్నట్లు చెప్పారు.



# ‘అందంగా ఉన్నావు.. చెప్పిన ప్లేస్‌కి రావాలి’.. మహిళతో సీఐ అసభ్య చాటింగ్



సనత్‌నగర్: ఫిర్యాదు చేసేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పురేందర్ రెడ్డిపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. అతడిని హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేస్తూ సైబరాబాద్ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు.

పోలీస్‌స్టేషన్ లో పిర్యాదు చేసిన మహిళతో ఇన్‌స్పెక్టర్ అసభ్య చాటింగ్ చేశాడు. దీంతో బాధితురాలు సైబరాబాద్ సీపీని ఆశ్రయించింది. సీఐ చేసిన చాటింగ్ వివరాలను సీపీకి చూపించింది. అందంగా ఉన్నావు.. చెప్పిన ప్లేస్‌కి రావాలంటూ సీఐ ఆమెకు మెసేజ్‌లు పెట్టాడు. దీంతో సీపీ అతడిపై చర్యలు తీసుకున్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com